


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-10-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 267 పేజీలు: 8+4 వెల: 6.50



మన్యం వీరుడికి ఘన నివాళులు 3

పరువునష్టం కేసులో రాహుల్ నిర్దోషి 5



తూత్తుకుడిలో 2 వేల ఎకరాల్లో ఎస్ఎస్ఎల్వీ కాంప్లెక్స్ 3

శ్రీహరికోట మూడో ప్రయోగ వేదిక ఏర్పాటు

ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి


## 2029 నాటికి నాలుగు లాంచ్‌ప్యాడ్‌లు




బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ ఫోరమ్ సదస్సులో స్పీకర్ ఓంబిర్లా 5

దేశాల మధ్య అవగాహనకు వారధిగా పార్లమెంట్లు





## మెట్రో ఫేజ్-2కు కేంద్రం పచ్చజెండా



ఐదు కారిడార్లతో 76 కి.మీ విస్తరణ

రూ.24,269 కోట్ల అంచనా వ్యయం

నాగోల్-ఎయిర్‌పోర్టు మార్గానికి ప్రాధాన్యం

రాయదుర్గం-కోకాపేట, ఎంజిబిఎస్-చాంద్రాయణ గుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్బీనగర్-వాయత్‌నగర్ మార్గాల్లో నిర్మాణం

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైల్ ఫేజ్2 ప్రతిపాదనలు కీలక దశకు చేరుకున్నాయి. రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త మెట్రో కారిడార్లను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విస్తరణలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం కల్పించే నాగోల్-ఎయిర్‌పోర్ట్ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. ఫేజ్2లో ప్రతిపాదించిన ఐదు కారిడార్లు నగరంలోని వివిధ ప్రాంతాలను మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానించేలా రూపొందించారు. నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్ల మార్గం ఈ ప్రణాళికలో అత్యంత పొడవైన కారిడార్‌గా ఉంది. రాయదుర్గం నుంచి కోకాపేట వరకు 11.6 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించారు. ఐటీ, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాలకు మెట్రో సేవలు చేరువ కావడం ఈ మార్గాల ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. పాతబస్తీ మెట్రో విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రతిపాదించారు. ఈ మార్గం అమల్లోకి వస్తే పాతబస్తీ ప్రాంతాల ప్రజలకు మెట్రో ప్రయాణ సౌకర్యం మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల >>2

148 మీటర్ల బ్యారేజ్ ఎత్తును పునఃపరిశీలిస్తా మన్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం లేకుండా సహకరిస్తామని హామీ

రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీకి ప్రతిపాదన

సిఎం రేవంత్ నాయకత్వంలో ముంబయిలో విస్తృతంగా చర్చలు

ప్రాజెక్టు వివరాలతో ప్రెజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్

## తుమ్మిడిహెట్టిపై 'మహా' సానుకూలం!



ముంబయిలో సోమవారం మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో చర్చలు జరుపుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సోమవారం ఉదయం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు. సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి న అవసరాన్ని తెలియజేశారు.ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే >>2



## 2న అమిత్‌షా హైదరాబాద్ రాక

1, 2 తేదీల్లో బిజెపి పాదయాత్ర

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** బీజేపీ అగ్రనేత, కేంద్రహోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. నవంబరు 2న ఆయన రానున్నారని ఆపార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు మద్దతుగా బీజేపీ చేపట్టిన 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. కేంద్ర ఎన్నికలసంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముసుగులో అక్రమాలకు >>2




## ఇ100 ఇంధనానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకూ అనుమతి

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఒఆర్‌టిహెచ్), ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల కోసం ఇ85తో పాటు ఇ100ను కూడా ఆమోదిత ఇంధన ఎంపికగా చేర్చుతూ, కేంద్ర మోటారు వాహన నిబంధనలకు సవరణలను సోమవారం నోటిఫై చేసింది. పర్యావరణ పరిరక్షణ, దేశీయ >>2


## నీటి కొరతకు చెక్!

భూగర్భ జలాల శాశ్వత పరిరక్షణకు ప్రణాళిక

జలవనరుల స్థితిగతులపై డ్రోన్లతో సర్వే

వాటర్‌గ్రూపింగ్ పద్ధతులపై మార్గదర్శకాలు

కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌ల పునరుద్ధరణ



**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో కరువు పరిస్థితులకు ప్రధాన కారణమైన నీటి కొరతకు, పడిపోతున్న భూగర్భ జల మట్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టిసారించింది. భవిష్యత్తు రోజుల్లో రాష్ట్రంలో చుక్క నీటి కొరత కూడా తలెత్తకుండా ఉండేందుకు, భూగర్భ జలమట్టాలను శాశ్వతంగా పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జల వనరుల స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, కాలువలు, జలాశయాల స్థితిగతులపై ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. ఏయే చెరువుల్లో ఎంత నీటి నిల్వ సామర్థ్యం ఉంది, ప్రస్తుతం వాటిలో ఉన్న నీరును ఏ మేరకు వినియోగించవచ్చు, సాగు, తాగు నిమిత్తం ఎంత శాతం వినియోగించుకునే అవకాశం ఉంటుందనే వివరాలతో కూడిన నివేదికను రూపొందించారు. అయితే కేవలం ప్రాథమిక అంచనాలతో సరిపెట్టకుండా, మైక్రో లెవెల్లో ప్రతీ జలవనరు పూర్తి సమాచారాన్ని రికార్డు చేసేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ ప్రోగ్రామ్ చేపట్టనున్నారు. శాటిలైట్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేలు, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నీటి వనరుల విస్తీర్ణం,వాటి క్యాచ్‌మెంట్‌ఏరియా, కాలుష్య ప్రభావాలను ఈస్క్రీనింగ్ ద్వారా రికార్డు చేయనున్నారు. అంతేగాక ప్రాంతాల వారీగా భూగర్భజలమట్టాలను తనిఖీ చేయనున్నారు. రాష్ట్రాన్ని వివిధ మండలాలు, రీజియన్లుగా విభజించి, ప్రాంతాల వారీగా గ్రౌండ్ వాటర్ లెవల్స్ తనిఖీ చేయనున్నారు. మరోపక్క భూగర్భ జలాల లభ్యత, లోతు అనేది ప్రతి జిల్లా, మండలానికి విభిన్నంగా ఉంటుంది. అర్బన్ ప్రాంతా లతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో భూ గర్భ జలాలు కాస్త పైకి ఉంటాయి. ఈ నేపథ్యంలో అర్బన్, సెమీ అర్బన్ జిల్లా నీటి వినియోగం తగ్గించేలా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయనున్నారు. గ్రేటర్ >>2

## వరి విత్తన విక్రయాలపై ఎల్‌నినో ఆంక్షలు!

వ్యాపారులకు ఆదేశాలు జారీ

అనధికార క్రాప్‌హాలిడే అమలు




**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఎల్‌నినో నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో యాసంగి సీజనులో వరి సాగు చేయనీయకుండా వ్యవసాయ శాఖ అడ్డుపడుతోంది. అనధికార క్రాప్ హాలిడే విధించిన అధికారులు వరి సాగు చేయవద్దని రైతులపై వత్తిడి తెస్తోంది. ఇందుకు అనుగుణంగా వరి విత్తనాల కొనుగోళ్లపై ఆంక్షలు విధించింది. అంతేకాకుండా మాట వినకుండా వరి సాగు చేస్తే దాని బాధ్యత ప్రభుత్వానికి లేదని రైతుల వద్ద వ్యవసాయ శాఖ సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ రైతులకు గట్టిగా సూచిస్తున్నది. ఎల్‌నినో కారణంగా సాగు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయని, ప్రాజెక్టుల్లో ఉన్న నీరు తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సి ఉన్నందున వరిసాగు చేయవద్దని >>2

## పెను తుఫాన్‌గా అర్నబ్



నేడు, రేపు భారీ వర్ష సూచన

50- 60 కి.మీ వేగంతో గాలులు

4 జిల్లాలకు రెడ్ , 5 జిల్లాలకు ఆరెంజ్ , 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** అర్నాబ్ తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారింది. శీతల గాలులు వీస్తుండటంతో వాతావరణం చల్లబడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం అర్నాబ్ తుఫానుగా బలపడింది. సోమవారం అర్ధరాత్రికి అది తీవ్ర తుఫాన్‌గా మారింది. ఇది ఈ నెల 27న అతి తీవ్ర తుఫానుగా బలపడనుంది. దీంతో అదే రోజు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణ్‌పేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక ఈ నెల 28న చాలా చోట్ల మోస్తరు నుండి విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా భూపాలపల్లి, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి చాలా భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. కాగా రాష్ట్రంలోని కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. అలాగే 29న రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అడక్కడకడ భారీ వర్షాలు పడే >>2



ఓటర్ల జాబితాల సవరణపై ఇసి.. సుప్రీంకు అఫిడవిట్ సమర్పణ

అన్ని ఉత్తర్వులు ఏకగ్రీవంగానే ఇచ్చామని వెల్లడి

## అంతా ఏకగ్రీవమే

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై తీసుకున్న నిర్ణయాల విషయంలో తమ వైఖరిని భారత ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు వివరించింది. ఈ మేరకు సోమవారం దాఖలు చేసిన అఫిడవిట్‌లో, ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అనుసరించిన విధానంపై ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు కేవలం వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగానే ఉన్నాయని పేర్కొన్న ఎన్నికల సంఘం, వాటిని కొట్టివేయాలని కోరింది. 2025 జూన్, 2025 అక్టోబర్, 2026 మే నెలల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వులను కూడా ఏకగ్రీవంగానే ఆమోదించినట్లు ఎన్నికల సంఘం పునరుద్ఘాటించింది. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో అధికారులు చేసే సూచనలు, అభిప్రాయాలు, పరిశీలనలు, ప్రశ్నలు, భిన్నమైన ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసే అభిప్రాయాలను కూడా నిర్ణయాల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటామని వివరించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర ఎన్నికల కమిష నర్లు ఫైళ్ల పరిశీలన సమయంలో చేసే వ్యాఖ్యలు, ప్రశ్నలు, సూచనలను కమిషన్ తుది >>2



## హైదరాబాద్‌లో కాలుష్యం ఎక్కువే..

నల్లగొండ, సంగారెడ్డిలో క్షీణిస్తున్న గాలినాణ్యత

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు నగరాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం స్లో పాయిజన్‌లా మారి మనుషుల ప్రాణాలు తీసేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి నగరాల్లో గాలి నాణ్యత క్షీణిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ మూడు నగరాల్లో 10 మైక్రోమీటర్ల వ్యాసం వరకు ఉండే కణ పదార్థం. (పీఎం10) కాలుష్యం జాతీయ పరిమితిని >>2



గురురామ్ దాస్ జయంతి సందర్భంగా సోమవారం అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద నిర్వహించిన 'నగర్ కీర్తన్' ఊరేగింపు దృశ్యం

## కేంద్రం గ్రీన్‌సిగ్నల్

>> ఇంధన లభ్యతను ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొంది. ప్రముఖ వాహన తయారీ సంస్థలు తమ ఇ100 మోడళ్లను మార్కెట్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త నిబంధనల ద్వారా ఉద్గార ప్రమాణాల చట్రంలో ఇ85 ఇంధనంతోపాటు ఇ100కు సమాన హోదా లభించింది. ఇ100 అంటే 100శాతం ఇథనాల్ కలిగిన ఇంధనం లేదా దాదాపు 100శాతం, ఎందుకంటే స్వల్ప పరిమాణంలో ఉండే నీరు దహనాన్ని మెరుగుపరుస్తుంది. ఈ యేడాది ఏప్రిల్ 27న విడుదల చేసిన ముసాయిదా నిబంధనలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించింది. వాటిని సమీక్షించింది. అనంతరం ఈ తుది నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది.
ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు స్వచ్ఛమైన పెట్రోల్ నుండి ఇ100 వరకు, ఇథనాల్, పెట్రోల్ ఏ మిశ్రమంతోనైనా నడిచేలా రూపొందించబడ్డాయి, వాహనంలోని సెన్సార్లు తదనుగుణంగా ఇంజిన్ పారామితులను సర్దుబాటు చేస్తాయి. బ్రెజిల్ ప్రస్తుతం 2003 నుండి ప్రపంచంలోనే అత్యంత పరిణతి చెందిన ఫ్లెక్స్ ఫ్యూయల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనిలో చెరకు నుండి తీసిన ఇథనాల్‌తో అధిక శాతం వాహన సముదాయం నడుస్తుంది. అయినప్పటికీ, వినియోగదారులకు సాధారణంగా తక్కువ ఇథనాల్ శాతం ఉన్న పెట్రోల్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

## అంతా ఏకగ్రీవమే

>> నిర్ణయంగా భావించరాదని స్పష్టం చేసింది. సంబంధిత విభాగాలు సిద్ధం చేసిన ఫైళ్లను తొలుత ఒక ఎన్నికల కమిషనర్‌కు, ఆ తర్వాత మరో ఎన్నికల కమిషనర్‌కు, చివరగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు పంపిస్తారని అఫిడవిట్‌లో పేర్కొంది. కమిషన్ ఆమోదించిన నిర్ణయాలను సంబంధిత ఫైళ్లలో నమోదు చేసి, ఎన్నికల కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ సంతకాలు తీసుకుంటారని వివరించింది. అనంతరం ఎన్నికల సంఘం కార్యదర్శి ద్వారా ఆ నిర్ణయాలను అధికారికంగా ప్రకటించి అమలు చేస్తారని తెలిపింది. 2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం, నిర్ణయాల పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర ఎన్నికల కమిషనర్లు పరస్పరం లేదా కమిషన్ అధికారులతో చేసే సూచనలు, ప్రశ్నలు, అభిప్రాయాలు మాత్రమే ఎన్నికల సంఘం తుది నిర్ణయంగా పరిగణించబడవని అఫిడవిట్‌లో పేర్కొంది. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం6లో మార్పులు చేశారన్న ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వుల వల్ల చట్టబద్ధమైన ఫారం6లో ఎలాంటి మార్పులూ జరగలేదని స్పష్టం చేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6 నిర్దేశిత దరఖాస్తు పత్రమని వివరించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో దీనికి అనుబంధంగా ఉపయోగించే డిక్లరేషన్ ఫారం మాత్రం ప్రత్యేక పత్రంగా ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఇటీవల వెలువడిన ఒక వార్తా కథనం ఎన్నికల సంఘంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలకు ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాల గురించి ముందుగా సమాచారం ఇవ్వలేదని ఆ కథనం పేర్కొంది. అంతేకాకుండా, కొన్ని నిర్ణయాలపై వారు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు, ఈ విషయంపై ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు కూడా ఆ కథనంలో వెల్లడించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ ప్రాధాన్యం సంతరించుకుంది.

## మెట్రో ఫేజ్-2కు కేంద్రం పచ్చజెండా

>> మార్గం ద్వారా పశ్చిమ హైదరాబాద్‌లోని నివాస, పారిశ్రామిక ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ విస్తరించనుంది. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల కారిడార్ తూర్పు దిశలో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచే లక్ష్యంతో ప్రతిపాదించారు.

## నీటి కొరతకు చెక్!

>> హైదరాబాద్ పరిధిలోని జిల్లాలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భువనగిరి వంటి జిల్లాలపై ప్రభుత్వం అత్యధికంగా ఫోకస్ పెట్టనున్నది. ఆయా ప్రాంతాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నారు. రిజర్వాయర్లు, మున్సిపల్ పంపింగ్ కేంద్రాలు, గ్రామీణ తాగునీటి ప్రాజెక్టులలో వాటర్ నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక నీటి సరఫరా పైపులైన్లలో లీకేజీలను అరికట్టడం, శుద్ధి చేసిన వ్యర్థ నీటిని ఇండస్ట్రీలు, నిర్మాణ రంగానికి మళ్లించి మంచి తాగునీటి ఒత్తిడిని తగ్గించేందుకు ప్రయత్నించనున్నారు. మరోపక్క ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో నీటి కరవు వచ్చిన పరిస్థితుల్లో ఆయా దేశాలు అనుసరించిన విధానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం అధ్యయనం చేస్తున్నది.
ముఖ్యంగా ఇజ్రాయెల్, సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో నీటి వినియోగంలో పాటిస్తున్న విధానాలు, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు వంటి వాటిని పరిశీలిస్తోంది. ఆయా దేశాల్లో తీవ్ర కరవు సమయాల్లో అమలు చేసే వాటర్ గ్రిడ్ యాజమాన్య పద్ధతులపై సీఎంవో అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్ నినో నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరింత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తీవ్ర కరవు వస్తే ఎదుర్కొనేందుకు వీలుగా ముందస్తుగా హెచ్చరించే వ్యవస్థలతో పాటు, అత్యవసర యాక్షన్ ప్లాన్లను రూపొందిస్తున్నారు. వ్యవసాయ రంగానికి నష్టం వాటిల్ల కుండా ప్రత్యామ్నాయ పంటలు, బిందు తేలిక పాటి సేద్యం, రిజర్వా యర్ల మధ్య వాటర్ గ్రూపింగ్ పద్ధతులపై స్పష్టమైన మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వ అధికారవర్గాలు వెల్లడించాయి.

## పెను తుఫాన్‌గా అర్నబ్

>> అవకాశం ఉందని తెలిపింది. అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 30 నుండి 40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.

## ఫడ్నవీస్‌ను ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానించిన సిఎం

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

## హైదరాబాద్ రాక

>> పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ మహాపాదయాత్ర చేయాలని నిర్ణయించింది. నవంబర్ 1న హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే పాదయాత్రలో నవంబరు 2న అమిత్ షా పాల్గొంటారు. రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించే పాదయాత్రలో ఆయన పాల్గొంటారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తుందని, యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి అమిత్ షా తెలంగాణ పర్యటన గత రెండున్నరేళ్లుగా అనేకసార్లు వాయిదాపడింది. ఈ నెల 3,4వ తేదీల్లోనే ఆయన తెలంగాణలో పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా రద్దయ్యింది. ఆ పర్యటనలో మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తిచేయగా.. అనూహ్యంగా పర్యటన రద్దుచేసుకున్నారు. అమిత్‌షా చివరిసారిగా తెలంగాణకు మే 2024లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం వచ్చారు. ఆ తర్వాత వివిధ సందర్భాల్లో షా రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల పర్యటనలు రద్దయ్యాయి. వరంగల్ జిల్లాలో ఓ కార్యక్రమానికి, ఖమ్మం జిల్లాలో బీజేపీ కార్యకర్తలతో భేటీకి, కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు షెడ్యూల్ ఖరారైనా చివరి నిమిషంలో రద్దుకావడం గమనార్హం. తెలంగాణలో పార్టీ బలోపేతంపై బీజేపీ అధిష్ఠానం దృష్టిసారించింది. అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ, అధికారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రస్థాయి నేతలు పోరాటం చేస్తున్నా.. నేరుగా అగ్రనేతలే రంగంలోకి దిగబోతున్నారు.

## వారం - వర్జ్యం

**27-10-2026, మంగళవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,**
**శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె**
తి.1. పాడ్యమి ఉ.7.01, తి.2. విదియ తె.4.06
న. భరణి మ.3.37, వ. రా.2.32-రా.3.59
దు.1. ఉ.8.21-ఉ.9.07
దు2. రా.10.17-రా.11.03
రాహు. మ.3.00-సా.4.30
శుభ ఉ.9.30-ఉ.10.00

## వార్తాఫలం

**మేషం :** సంతాన విద్యావిషయాలలో సమస్యలు ఎదురై చికాకు పెడతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం :** క్రొత్త వ్యాపారాల ప్రయత్నాలు వాయిదా పడతాయి. పలుకుబడి నామ మాత్రముగా పెరుగుతుంది.

**మిథునం :** ఏ పని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కర్కాటకం :** అనుకోని అవకాశాలు కలసి వస్తాయి. తద్వారా లాభ పడతారు. యోగాభ్యాసాలు చేయటం వలన లాభ పడతారు.

**సింహం :** గృహాలంకరణ సామాగ్రి, విలువైన వస్తు సామాగ్రి కొనుగోలు చేస్తారు. స్పర్ధలు రాకుండ జాగ్రత్తలు పాటించండి.

**కన్య :** కోర్ట్ సంబంధిత కేసులు మీకు అనుకూలంగా మారతాయి. శుభకార్యాలకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి.

**తుల :** మీ వాళ్ళకు సరైన అవకాశాలు కలిపించడానికి లేక వాళ్ళ ప్రతిభతో అవకాశాలు రావచ్చును. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. అందరిని కలుపుకొని మంచి పనులు చేస్తారు.

**ధనుస్సు :** వృత్తి యందు బాధ్యతలు పెరుగుట వలన అధిక శ్రమకు లోనవుతారు. పోటీ పరీక్షలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం :** రకరకాల సమస్యలు ఉన్నప్పటికీ అన్నింట అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఆరోగ్యపరంగా జాగ్రత్తలు వహించండి.

**కుంభం :** ఎంత పని చేసిన సవతి ప్రేమ చూపే ఉన్నతాధికారులు వైఖరి కొంత మీకు నిరాశకు గురి చేస్తుంది.

**మీనం :** ఆర్థికంగా కొంత వెసులుబాటు వున్నప్పటికీ, తప్పని పరిస్థితులలో అప్పు చేయవలసి వస్తుంది. ఆహ్వానాలు అందుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తుమ్మిడిహెట్టిపై 'మహా' సానుకూలం!

>> అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టంచేశారు. జాతీయప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.
స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. అంతకు ముందు సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు.
గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేక పోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేక పోయామన్నారు.

## వరి విత్తన విక్రయాలపై ఎల్‌నినో ఆంక్షలు!

>> వ్యవసాయశాఖ రాష్ట్రంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఇక వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలోనే విత్తన వ్యాపారులు విత్తనాలను అమ్మాల్సి ఉంటుంది. రైతులకు వరి విత్తనాలను విక్రయించవద్దని సీడ్, ఇతర వ్యాపారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎవరైనా రైతు తప్పనిసరిగా వరి విత్తనాలు కావాలంటే విత్తన వ్యాపారికి రైతు ఒప్పంద పత్రం రాసి ఇవ్వాల్సి ఉంటుంది. సెల్ఫ్ డిక్లరేషన ఫారం పేరిట వ్యవసాయ శాఖ ఒక పత్రాన్ని విత్తన వ్యాపారులకు పంపించింది. రైతు ఆ సెల్ఫ్ డిక్లరేషన ఫారంపై సంతకం చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఫారంలో రైతు పేరు, తండ్రి పేరు, సెల్, ఆధార్ నంబరు, గ్రామం, మండలం, జిల్లా వివరాలను పేర్కొనాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తిచేస్తేనే రైతుకు విత్తనాలు విక్రయిస్తారు. ఈ సెల్ఫ్ డిక్లరేషన్‌లో నాకు వరి మాత్రమే పండే అవకాశాలున్నందున నా సొంత నిర్ణయంతో వరి సాగుకు నిర్ణయం తీసుకున్నాను. కరెంటు కారణంగా కానీ నీరందకగానీ, మరే ఇతర కారణాలతో కానీ పంట రాని పక్షంలో డీలర్లకు కానీ ప్రభుత్వానికి కానీ ఎలాంటి సంబంధం లేదు. ఇది నా ఇష్ట పూర్వకంగా నేను తీసుకున్న నిర్ణయం. కావున నాకు విత్తనం అమ్మగలర్సు అని వరి విత్తనాలు కావాల్సిన రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది.



సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న టిటిడి అధికారులు

## ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

### గ్రావిటీతో నీళ్లు తేవడం కుదరదని తెలితే మంత్రి ఉత్తమ్ రాజీనామా చేస్తారా?: హరీష్‌రావు సవాల్

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్ల తెస్తామంటున్నారనీ, అదే నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్ల తేవడం కుదరదని తేలితే ఉత్తమ్ రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బృందం మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసిన నేపథ్యంలో హరీశ్‌రావు సోమవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు డిపిఆర్‌ను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే ఏపీలో వర్షపాత లోటు ఎక్కువ. అలాంటిడి ఇక్కడ క్రాప్ హాలీడే ఎందుకు ఉంది? ఏపీలో ఎందుకు లేదు. తెలంగాణలో సాగునీటి పంపులను సక్రమంగా వినియోగించి ఉంటే వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడేవి కావని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు వద్ద పంపులు నడపకపోవడం వల్లే పట్టిసీమలో పంపులు నడపాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర పర్యటనపైనా హరీశ్ రావు విమర్శలు చేశారు. శ్రీశైలంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎందుకు ఎత్తిపోసుకోలేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ప్రాజెక్టులో ఐదు మోటార్లు ఉన్నప్పటికీ రెండు మోటార్లనే నడుపుతున్నారని, అవి కూడా కొన్ని గంటలపాటే పనిచేస్తున్నాయని విమర్శించారు. శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎంత నీటిని వినియోగించుకున్నాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను కుప్పం వరకు తరలిస్తున్నారని, దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల్లో పంపుల వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కన్నెపల్లి వద్ద నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు వినియోగించుకోలేదని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ, ఇది ప్రకృతి వల్ల ఏర్పడిన కరువు కాదని వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవే. కాలం తెచ్చిన కరవు కాదు అని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 42 రోజుల్లోనే మహారాష్ట్రతో చర్చలు జరిపిందని తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు వెయ్యి రోజుల తర్వాత చర్చలు జరుపుతోందని విమర్శించారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ సంబంధిత అంశాలపై ముందుగానే చర్చలు జరపలేదని 2007 నుంచి 2014 వరకు ఏడేళ్లు, ఆ తర్వాత కూడా మరో మూడేళ్ల కాలయాపన జరిగిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. మ్యాప్‌లుచూడండి సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగం, మహారాష్ట్రతో చర్చలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 2013లో తమ్మిడిహట్టి ఎత్తు తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందని మినిట్స్‌లో ఉంది. తెలంగాణకు అవసరమైనన్ని నీళ్ల తమ్మిడిహట్టి వద్ద లేవని సీడబ్ల్యూసీ అనేకసార్లు చెప్పింది అని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు.



సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన గవర్నర్ శుక్లా

## రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీతో గవర్నర్ శుక్లా భేటీ

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లాతో కలిసి సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్రపతితో గవర్నర్ భేటీ అయ్యారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో తెలంగాణ రాష్ట్ర పరిస్థితులపై గవర్నర్ చర్చించారు.

## కెఆర్ఎంబి భేటీ మళ్లీ వాయిదా

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** కెఆర్ఎంబీ సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ సమావేశం షెడ్యూల్ ప్రకారం మంగళవారం జరగాల్సి ఉంది. కానీ అధికారులు అందుబాటులో లేనందువల్ల వాయిదా పడింది. ఈ సమావేశం నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌లో కాలుష్యం ఎక్కువే..

>> మించి 33 శాతం వరకు పెరగడంతో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణిస్తోందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, రోడ్లపై లేచే దుమ్ము, ధూళి, నిరంతర నిర్మాణ కార్యకలాపాల వల్ల ఆరోగ్యకరమైన గాలి పీల్చడం కష్టంగా మారింది. 2025-26 వార్షిక సగటు గణాంకాల ప్రకారం, సూక్ష్మ ధూళి కణాలైన పీఎం-10 స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదుకావడంతో పరిస్థితి అదుపుతప్పుతోందని హెచ్చరించింది. హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా కాలుష్యం నమోదు కాగా, సంగారెడ్డిలో 30 శాతం, నల్లగొండలో 18.3 శాతం మేర అధికంగా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, గాలిలో పీఎం10 వార్షిక సగటు క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించరాదు. అయితే 2025-26 లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములు ఉండగా, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం10 వార్షిక సగటు కేవలం 15 మైక్రోగ్రాములు మాత్రమే ఉండాలి. కానీ హైదరాబాద్‌లో డబ్ల్యూహెచ్ఓ పరిమితి కంటే 5.3 రెట్లు ఎక్కువగా ఉండగా, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు అధికంగా ప్రమాదకర స్థాయిల్లో కాలుష్యం ఉంది. 2019లో ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం వల్ల హైదరాబాద్లో కాలుష్య తీవ్రత పోలిస్తే కొంత తగ్గినప్పటికీ, ఇప్పటికీ సాధారణ స్థాయిల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ సూక్ష్మ ధూళి కణాలు శ్వాస వ్యవస్థ ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులతో పాటు, రక్తప్రసరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరిస్తున్నారు.



బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యేందుకు సోమవారం ఢిల్లీకి బయల్దేరిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

## ఢిల్లీలో బ్రిక్స్ సమావేశాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరు

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా ఢిల్లీకి వెళ్లారు. సంవిధాన్ సదన్(పాత పార్లమెంట్ భవనం)లో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో వీరు పాల్గొంటున్నారు. మంగళవారం జరిగే సమావేశాల్లో కూడా వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ఈ సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు.అలాగే, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. శాసన మండలి చైర్మన్, స్పీకర్ వెంట తెలంగాణ శాసనమండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్, మండలి చైర్మన్ ఓఎస్డీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఈ సమావేశాలకు వెళ్లారు.

## భారత్, అమెరికాలపై అల్‌కాయిదా మరో కుట్ర

### వాన్‌గార్డ్ డాక్ట్రిన్ పేరిట మత చిచ్చుకు యత్నాలు

### కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు టార్గెట్‌గా ఉన్నట్లు నిఘా వర్గాలకు సమాచారం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ప్రపంచ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా తన కార్యకలాపాల వ్యూహాన్ని పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోం ది. అమెరికా, భారత్ వంటి శక్తిమంతమైన దేశాలతో నేరుగా తలపడటం అసాధ్యమని గ్రహించిన ఆ సంస్థ ఇప్పుడు పరోక్ష దాడులకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా తన పాత సిద్దాంతం "వాన్‌గార్డ్ డాక్ట్రిన్" (అగ్రగామి సిద్ధాంతం)ను తిరిగి తెరపైకి తెచ్చింది. స్థానిక సమస్యల ను ఆసరాగా చేసుకుని, వాటికి మతపరమైన రంగు పులిమి అమెరికాతో పాటు భారత్‌లో అశాంతిని సృష్టించడమే ఈ వ్యూహం యొక్క ముఖ్య ఉద్దేశమని నిఘా వర్గాలకు సమాచారం అందింది. అమెరికాలో పలు రకాల వ్యూహాలకు రెడీ అయిన అల్‌ఖైదా భారత్‌లో మాత్రం కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలను టార్గెట్‌గా ఎంచుకున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. సెప్టెంబర్ 11 దాడుల 25వ వార్షికోత్సవం సందర్భంగా అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ కుమారుడు హమ్జా బిన్ లాడెన్ ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేయడంతో నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. చీలి పోయిన అల్‌ఖైదా ఉగ్రసంస్థ గ్రూపులను ఏకం చేసి, బిన్ లాడెన్ వారసత్వాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగానే బిన్ లాడెన్ కుమారుడు ఈ వీడియో విడుదల చేశాడని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇక వాన్‌గార్డ్ డాక్ట్రిన్ గురించి పరిశీలిస్తే భద్రతా దళాలతో నే రుగా తలపడకుండా...9/11 తరహాలో దాడులకు దిగి సంచలనం సృష్టించడం ఇందులో మొదటిది. దీని తరువాత స్థానికంగా జరిగే చిన్నపాటి నిరసనలు, సున్నితమైన అంశాలను వాడుకుని వాటిని ప్రపంచ సమస్యలుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం. సోషల్ మీడియాను వాడు కుని తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, హింసాత్మక భావజాలాన్ని నూరిపోసి యువతను రాడికలైజ్ చేయడం మరో అంశం. తద్వారా ఇ స్లామిక్ దేశాలతో భారత ప్రభుత్వం పోరాడేలా చేసి, ఆ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని అల్‌ఖైదా పన్నాగం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ముఖ్యంగా కాశ్మీర్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకోవాలని అల్‌ఖైదా వ్యూహంలో భాగంగా వుందని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ప్రాంతాల్లోని సున్నితమైన అంశాలను వాడుకుని, వాటికి మతపరమైన రంగు పులిమి ప్రపంచవ్యాప్తంగా ప్రచా రం చేసి లబ్ది పొందాలని అల్‌ఖైదా భావిస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. లాడెన్ మరణం తరు వాత, ఐసిస్ ప్రాబల్యంతో అల్‌ఖైదా బలహీనపడినా మళ్లీ పుంజుకునేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. అల్‌ఖైదా కార్యకలాపాలపై భారత భద్రతాఏజెన్సీలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం వుందని నిఘా వర్గాలు హెచ్చరించాయి.

## ఎఐసిసి చీఫ్ ఖర్గేకు వ్యతిరేకంగా బిజెపి నిరసనలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** ప్రధాని మోడీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే మోదీ కాదు ఆయన బాబైనా పోవాల్సిందే అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాషాయ పార్టీ నాయకులు కాంగ్రెస్ అధ్యక్షుడిపై భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్య క్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి ఖర్గే బహి రంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయ కులూ స్పందించారు. ఖర్గేను కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. ఇది చాలాబాధాకరం. ఈ వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతి కరమైన విషయం ఏంటంటే ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్నస్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఓట్ బచావో, దేశ్ బచావో ర్యాలీ వసతుల కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీ లో జరుగబోయే ఓట్ బచావో దేశ్ బచావో ర్యాలీ కోసం ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఒక కమిటిని వేసింది. ఈ కమిటిలో ఇద్దరు మంత్రులను ముగ్గురు ఎంపిలను నియమించారు. తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్ ఎంపి మల్లురవి, పార్లమెంట్ సభ్యులు బలరామ్‌నాయక్,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,అదే విధంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి సభ్యులుగా ఈ కమిటి పనిచేస్తుంది. రాంలీలా మైదానంలో జరిగే ర్యాలీలోపాల్గొనేందుకు దేశరాజధాని ఢిల్లీకి బయలుదేరే కార్యకర్తలకు ప్రయాణవసతి, అక్కడ బసచేసే వసతి, ఇతరత్రా అనేక అత్యవసర వసతులు వీరు కల్పించేందుకు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా నియమించారు. ప్రయాణ సందర్భంగా ఎలాంటి అత్యవసరాలు కావాల్సిన వారిని సంప్రదించడానికి కార్యకర్తలకు కమిటీ సభ్యుల ఫోన్ నెంబర్లు కూడా టిపిసిసి చీఫ్ ప్రకటించారు. మల్లురవిని సంప్రదించడానికి 9490794250 కి ఫోన్ చేయాలని అదే విధంగా మంత్రులు పొన్నం ప్రభాకర్‌ను సంప్రదించడానికి 9849004868, వాకిటి శ్రీహరి 9440297597కు బలరామ్ నాయక్ 9908355699కి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని 8897084444 సంప్రదించాలని మహేష్ తెలిపారు.

# 2029 నాటికి నాలుగు లాంచ్‌ప్యాడ్‌లు

### తూత్తుకుడిలో 2 వేల ఎకరాల్లో ఎస్ఎస్ఎల్వీ కాంప్లెక్స్

### శ్రీహరికోట మూడో ప్రయోగ వేదిక ఏర్పాటు

### ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** అంతరిక్ష ప్రయోగ మౌలిక సదుపాయాలను విస్తరించాలని ఇస్రో యోచిస్తోందని ఆ సంస్థ చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇందులో భాగంగా 2029నాటికి దేశవ్యాప్తంగా నాలుగు క్రియాశీలక ప్రయోగ వేదికలకు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ విస్తరణలో భాగంగా తమిళనాడులోని కులశేఖరపట్టినం వద్ద స్మాల్ శాటి లైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) కోసం 2,000 ఎకరాల ప్రత్యేక కాంప్లెక్స్‌ను, శ్రీహరికోటలో మూడవ ప్రయోగ వేదికను ఏర్పాటు చేయనున్నారు. దేశీయంగా, విదేశాలలో పెరుగుతున్న ఉపగ్రహ ప్రయోగాల డిమాండ్‌ను తీర్చడమే ఈ చర్య లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ, 'ప్రపంచవ్యాప్తంగా ఉపగ్రహ ప్రయోగాలకు డిమాండ్ పెరుగుతోంది. అదనపు ప్రయోగ సౌకర్యాలు భారతదేశం మరిన్ని మిషన్లను చేపట్టడానికి, ప్రపంచ వాణిజ్య అంతరిక్ష మార్కెట్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి సహాయపడతాయి. ఈ మౌలిక సదుపాయాలు భూపరిశీలన, కమ్యూనికేషన్లు, నావిగేషన్ కోసం ఉపయో గించే ఉపగ్రహాలకు మద్దతు ఇవ్వగలవు. అయితే, వాస్తవ ప్రయోగ సామ ర్థ్యం నిర్మాణం, ప్రారంభించడం, రాకెట్ల లభ్యత, కార్యాచరణ సంసిద్ధతపై ఆధారపడి ఉంటుంది' అని పేర్కొన్నారు.



'తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో గల కులశేఖరపట్టినంలో ప్రతిపాదిత ఎస్ఎస్ఎల్వి కాంప్లెక్స్, విస్తరణ ప్రణాళికలో ఒక కీలక భాగం. ఈ సదుపాయంలో ప్రయోగ మౌలిక సదుపాయాలు, అనుసంధాన భవనాలు, టెలిమెట్రీ, ట్రాకింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉంటాయి. ఈ సదుపాయాలు రాకెట్లను సిద్ధం చేయడానికి, వాటి ప్రయాణాలను పర్యవేక్షించడానికి, ప్రయోగ వాహనాలతో సంబంధాన్ని కొనసాగించడానికి సహాయపడతాయి' అని ఇస్రో చైర్మన్ నారాయణన్ వివరించారు.

శ్రీహరికోటలో గల సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఇస్రో మూడవ ప్రయోగ వేదికను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ ప్రయోగ వాహనాలకు మద్దతు ఇవ్వడం, దేశ ప్రయోగ సామర్థ్యాన్ని పెంచడం దీని ఉద్దేశమన్నారు. ప్రస్తుతం శ్రీహరికోటలో రెండు ప్రయోగ వేదికలను నిర్వహిస్తోంది. ప్రయోగాలకు డిమాండ్ పెరిగేకొద్దీ, ప్రతిపాదిత సదుపాయం భవిష్యత్ మిషన్లకు అనుగుణంగా సహాయ పడుతుందన్నారు. ఇస్రోను ప్రైవేటీకరించబోమని చైర్మన్ వి.నారాయణన్ పునరుద్ఘాటించారు. అయితే ప్రైవేట్ కంపెనీలు, స్టార్టప్‌లతో భాగస్వా మ్యాలకు ప్రాముఖ్యత ఇస్తామని తెలిపారు.

# లౌకివాదంపై దాడిచేసే పెద్ద నేరస్తుడు జ్ఞానేశ్‌కుమార్

### ఎఐసిసి జనరల్ సెక్రటరీ అవినాశ్‌పాండే ఆరోపణ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** దేశంలో లౌకికవాదంపై దాడిచేసే పెద్ద నేరస్తుడు సిఇసి జ్ఞానేశ్‌కుమార్ అని తెలంగాణ అబ్జర్వర్ ఎఐసిసి జనరల్ సెక్రటరీ అవినాష్ పాండే ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ జ్ఞానేష్ కుమార్‌ను పదవీ నుండి తొలగించడంతోపాటు ఆయన పై విచారణ జరగాలనీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం తీసుకుందనీ ఆయన తెలిపారు. దేశంలో లౌకికవాదం పై దాడి జరపడమే కాదు ప్రజల అధికారాలు లాక్కుంటూ ప్రజాస్వామ్యంను హత్య చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆవేదన చెందారు. ముగ్గురు ఎన్నికల కమీషన్ అధికారులు ఉండగా ఒక్క జ్ఞానేష్ కుమార్ భిన్నంగా నిర్ణయాలు తీసుకున్నారనీ, ఫార్మ్ 7 ను మిగిలిన అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారనీ ఆయన గుర్తు చేశారు. దురుద్దేశంతోనే ఫార్మ్ 7 ని వాడుతున్నారనీ, ఓట్లు తొలగించి ప్రజలు ఇబ్బందుల్లోకి నెడుతున్నారని అన్నారు. లౌకికవాదం కాపాడుకోవాలనీ కొన్ని నెలలుగా రాహుల్ గాంధీ నిరసనలు చేస్తున్నారనీ ఆయన వివరించారు. జ్ఞానేష్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న పోరాటం కేవలం ప్రారంభం మాత్రమే ఢిల్లీ రాం లీలా మైదానంలో లో భారీ సభ కాంగ్రెస్ ఇండియా కూటమి ఏర్పాటు చేసిందనీ తెలిపారు. లద్దాక్ నుండి అండమాన్ నికోబార్ వరకు నేతలు భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. సర్ పై మాత్రమే మన పోరాటం కాదనీ, లౌకికవాదం ఖూనీ చేస్తున్న వారిపై మన పోరాటమనీ అన్నారు. మోడీ తీరు తానా షాహీని తలపిస్తోంది. సర్‌తో ఓట్ల తొలగింపు జరుగుతుందని రాహుల్ గళం విప్పారని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర, హర్యానా మధ్యప్రదేశ్ ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ఆధారాల ను బయట పెట్టాం,ఎన్నికల కమిషన్ విచారణ చెయ్యాలని డిమాండ్ చేసినా ఫలితం లేదని ఆవేదన చెందారు. ఓట్ల తొలగింపు,ఎన్నికల అక్రమ విధానాల ఆచరణపై ఎన్నికల కమీషన్ నుండి నివేదిక కోరినా ఇప్పటి వరకు సమాధానం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హర్యానా ,మధ్య ప్రదేశ్ ఉత్తర ప్రదేశ్‌రాష్ట్ర లో డిజిటల్ రికార్డ్ అడిగాముఎన్నికల అధికారులు ఎలాంటి రికార్డ్ ఇవ్వబోము అని చెప్పారనీ గుర్తుచేశారు. బిజెపి మొద్దు నిద్రపోతుంది ప్రధాని మోదీ మోనం వహిస్తున్నారు మా పోరాటం, మా వినతుల పై కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం ఇప్పటి వరకు లేదని ఆయన అన్నారు. దేశ యువత భవిష్యత్తు బిజెపి ఆగం చేసిందనీ, ఒక్క కాంపిటేటివ్ పరీక్ష సజావుగా జరగలేదనీ జ్ఞానేష్ కుమార్ పౌరుల ఓట్ దొంగలిస్తున్నారనీ ఆరోపించారు. దేశం లో ప్రతి పౌరుడికి సిఇసి జ్ఞానేష్ కుమార్ దొంగతనం గురించి తెలియాలనీ ఓట్ బచావ్ దేశ్ బచావ్ నినాదంతో ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఉద్యమిద్దాం అని పిలుపు నిచ్చారు.తెలంగాణ నుండే అధిక జన సమీకరణ జరగాలనీ ఆయన కోరారు.

# మన్యం వీరుడికి ఘన నివాళులు



కొమురంభీం సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క తదితరులు

### జోడేఘాట్‌లో జల్, జంగిల్, జమీన్ కోసం పోరాడిన కొమురంభీం వర్ధంతి వేడుకలు

### సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీల వినతులు

### గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం : దర్బార్‌లో మంత్రులు లక్ష్మణ్‌కుమార్, సీతక్క

**కెరమెరి/ ఆసిఫాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** ఆదివాసీల హక్కుల కోసం పోరాడి, జల్–జంగల్–జమీన్ నినాదంతో గిరిజనుల్లో చైతన్యం నింపిన ఆదివాసీ వీరుడు కొమురంభీం అని రాష్ట్ర సాంఘిక, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పంచాయతీరాజ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. కుమురంభీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం భీం సమాధి దగ్గర జెండా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమాధి వద్ద మంత్రులు, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, వెద్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విట్టల్, కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్, ఐటిడిఏ పీఓ మంద మకరంద, అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్, కాగజనగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, డిఎఫ్ఓ బాలమణి, కొమురం భీం మనవడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరుడు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన దర్బార్‌లో మొదటగా పలువురు గిరిజన సంఘాల నాయకులు పాల్గొని కుమురంభీం చేసిన పోరాటాలు, ఆదివాసీల హక్కుల సాధనకు ఆయ న చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజ నుల ఆత్మగౌరవం, స్వయం పాలన, భూమి హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొ న్నారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిగా పరిష్కరిం చాలని మంత్రులను కోరారు. కుమురం భీం ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని పలువురు నాయకులు కోరారు. జోడేఘాట్‌లో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమం ద్వారా ఆదివాసీ వీరుడి త్యాగాలను మరోసారి స్మరిం చుకుంటూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చకు ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇది రాజకీయ వేడుక కాదని, జల్ జంగిల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన మహనీయుడు జాతర అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, రహదారులు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మంచి మనసుతో అభివృద్ధికి పాటుపడితే ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారన్నారు. ప్రతి శాఖ అధికారి కలిసికట్టుగా పనిచేసి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనుల భాగంగా 180 కోట్లతో పలు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమరం భీమ్ దేశానికి గర్వకారణమని, ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని, ఆయన కలలుగన్న ప్రపంచం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ. 60 కోట్లు దనోరలోని ఇంటెక్ వెల్ కోసం మంజూరు అయ్యాయని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొమరం భీమ్ అందరికీ ఆదర్శ ప్రియుడని, జల్ జంగల్ జమీన్‌తో పాటు ప్రతి మనిషి స్వేచ్ఛగా గౌరవంగా ఉండాలని పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల గుస్సాడి నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురిని ఆకట్టుకున్నాయి.



ఈగల్‌కు చిక్కిన గంజాయి స్మగ్లర్ జతిన్‌బీ, వ్యసనపరులు

## హైదరాబాద్‌లో ఈగల్ పోలీసుల మెరుపుదాడులు

### గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్టు

### 66 మంది గంజాయి ప్రియులపై కొరడా

### మూడు పునరావాస కేంద్రాలకు తరలింపు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు సోమవారం మెరుపు దాడులు నిర్వహిం చారు. బాలానగర్ పరిధిలోని ఫతేనగర్‌లోని ఎల్‌బిఎస్‌నగర్‌లో తన ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న షేక్ జతిన్ బీ (75) వృద్ధురాలిని అరెస్ట్ చేశారు. ఆమె ఇంట్లో 179.1 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఆమె 41 ప్యాకెట్లలో వుంచగా పట్టుకున్నారు. ఆమె వద్ద గంజాయి కొనుగోలు చేసే వారిని గుర్తించగా ఆ సమయంలో అక్కడ 75 మంది పట్టుబడ్డారు. వీరికి పరీక్షలు నిర్వహించగా అందులో 66 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా వచ్చింది. 45 మందిని గాంధీ ఆసుపత్రి ఆవరణలో గల పునరావాస కేంద్రానికి, 16 మందిని ఆమన్‌గల్ పునరావాస కేంద్రానికి, ఐదుగురిని కొత్తూరు పునరావాస కేంద్రానికి తరలించారు. జతిన్‌పై గంజాయి స్మగ్లింగ్‌కు సంబంధించి ఏడు కేసులు వున్నాయి. ఆమె పలుమార్లు అరెస్టయి జైలుకు వెళ్లింది.

**గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత**

కాగా గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలుచేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్‌గా వున్న సాయిరామ్‌ను అరెస్ట్ చేసి 4.45 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను జప్తు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం గాలింపుచర్యలు చేపట్టారు.

## ఎఐ చాట్‌బాట్‌లో వ్యక్తిగత సమాచారంపై జాగ్రత్తలు పాటించాలి

### సైబర్ నిపుణుల సూచన

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** కృత్రిమ మేధ అందుబాటులో వచ్చిన తరువాత అన్ని రంగాలలో దీని వాడకం పెరగడం తెలిసిందే. ముఖ్యంగా చాట్‌బాట్‌ల వినియోగం, ఈమెయిల్స్ రాయడం, క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకోవడం, ప్రయాణ ప్రణాళికలు రూపొందించడం, ఇలా ఎన్నో పనులకు ఏఐని ఉపయోగిస్తున్నారు. అయితే ఏఐతో మాట్లాడేటప్పుడు మన వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సైబర్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కంప్యూటర్ పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని చాట్‌బాట్‌లలో నమోదు చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఖాతాలోకి లాగిన్ కావడంలో సమస్య ఎదురైతే, పాస్‌వర్డ్ చెప్పకుండానే ఆ సమస్యను వివరించి సహాయం పొందవచ్చని వారు తెలిపారు. దీంతో పాటు బ్యాంకు, చెల్లింపుల వివరాలు బ్యాంకు ఖాతా నంబర్లు, డెబిట్, క్రెడిట్ కార్డుల పూర్తి నంబర్లు, సీవీవీ వంటి సున్నితమైన ఆర్థిక వివరాలను పంచుకోవద్దని, ఏదైనా లావాదేవీ గురించి తెలుసుకోవాలన్నా, ఖర్చులను లెక్కించాలన్నా వ్యక్తిగత వివరాలను తొలగించి సమాచారం ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ఆధార్, పాస్‌పోర్టు వ ంటి గుర్తింపు పత్రాలు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాల్లో పేరు, చిరునామా, ఫొటో, గుర్తింపు నంబర్లతో పాటు ఇతర వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఆఫీసు రహస్య పత్రాలు కంపెనీల అంతర్గత నివేదికలు, ఇంకా ప్రచురించని కథనాలు, క్లయింట్ల వివరాలు, రహస్య ఈమెయిల్స్‌ను ఏఐ చాట్‌బాట్‌లలో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని, ఇలా చేయడం వల్ల సున్నితమైన సమాచారం బయటపడే ప్రమాదం వుందని వారు హెచ్చరించారు. ఇతరుల వ్యక్తిగత సమాచారం వారి అనుమతి లేకుండా చాట్‌బాట్ లలో పంచుకోవద్దని, ఒక సమస్యకు పరిష్కారం తెలుసుకోవాల నుకున్నప్పుడు పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాల వంటి గుర్తింపు వివరాలను తొలగించి సాధారణంగా వివరించవచ్చని, ఇలా చేయడం వల్ల ఇతరుల గోప్యతకు భంగం కలగకుండా అవసరమైన సలహా పొందే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

## రాహుల్ కాన్వాయ్‌లో ఒకదాన్నొకటి ఢీకొన్న వాహనాలు

**సుల్తాన్‌పూర్, అక్టోబరు 26:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ కాన్వాయ్‌కి ప్రమాదం జరిగింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ వైపు వెళ్తుండగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఆయన కాన్వాయ్ వెనుక వస్తున్న వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. అయితే ఈ ఘటనలో రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న ప్రధాన వాహనానికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఆయన సురక్షితంగా బయటపడ్డారు.

సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో రాహుల్ గాంధీ లక్నోలోని నివాసం నుంచి సుల్తాన్‌పూర్ పర్యటనకు బయలుదేరారు. 2018 నాటి ఒక క్రిమినల్ పరువు దావా కేసుకు సంబంధించి సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో, ఆయన విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసు కుంది. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే లోని హాలి యాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 89.5 కిలో మీటర్ల మైలురాయి వద్దకు కాన్వాయ్ చేరుకోగానే వెనుక భాగంలో వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. అసలు ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానికి సంబంధించిన స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం లభించిన ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడం, వాహనాలకు పెద్దగా నష్టం వాటిల్లకపోవడం ఊరటనిచ్చే అంశం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




**శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం**
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్
బహిరంగ వేలము ప్రకటన

లేఖ నెం. 19/ఎస్.వి.ఎస్.టి/ఎస్.ఎస్.సి/2026, తేది: 27.10.2026

ఇందుమూలముగా సమస్త వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా సదరు దేవస్థానము నందు నిరుపయోగమైన ప్లాస్టిక్, ఇనుము, ఇత్తడి (ధ్వంసమైనవి) బహిరంగ వేలము ద్వారా తేది: 06.11.2026 రోజున ఉ.11.00 గం.లకు వేలం వేయబడును. ఇట్టి వేలములో పాల్గొనువారు రూ.5000-00 ధరావత్తు చెల్లించి వేలము నందు పాల్గొనవలెను. ఇతర వివరములు దేవస్థాన కార్యాలయము నందు తెలియపరచుట జరుగును.

DIPR.No.12499-PP/CL/Advt/1/2026-27, తేది: 26.10.2026 సం/- కార్యనిర్వహణాధికారి



**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-III, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ భవనం,
# 6-1-2/1, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్ - 500063.

**టెండర్ నోటీసు**

NIT. No. HMDA/DEV/EE/Div-III/2026-27 తేది: 23.10.2026

డివిజన్-III లో కింది పనుల కొరకు టెండర్లు ఆహ్వానించబడినవి:

| క్ర.సం. | నిట్ నం. | తేదీ | స్థానం |
| --- | --- | --- | --- |
| 1 | HMDA/DEV/EE/Div-III/23/ 2026-27 | 23.10. 2026 | హైదరాబాద్, పివిఎన్ఆర్ మార్గ్ లోని పీపుల్స్ ప్లాజాలో ఉన్న 'తెలంగాణ పీపుల్స్ ప్లాజా' అవుట్‌డోర్ పైలాన్ సైన్‌బోర్డుకు మరమ్మతులు మరియు పునరుద్ధరణ. ఇందులో భాగంగా, దెబ్బతిన్న యాక్రిలిక్ అక్షరాలు, హెచ్‌ఎండిఏ లోగో స్థానంలో డిజిటల్ ప్రింటెడ్ ఫ్లెక్స్ వినైల్ మరియు ఇరువైపులా ఎల్ఈడి లైటింగ్ రిప్లేస్‌మెంట్ సహా. |
| 2 | HMDA/DEV/EE/Div-III/24/ 2026-27 | 23.10. 2026 | BPP ఆధ్వర్యంలో, NTR మెమోరియల్ సమీపంలోని ఉద్యానవన కార్యాలయానికి మరమ్మతుల ఏర్పాటు. |
| 3 | HMDA/DEV/EE/Div-III/25/ 2026-27 | 23.10. 2026 | BPP ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మెమోరియల్ సమీపంలో ఉన్న హార్టికల్చర్ కార్యాలయ ఆవరణలో స్టోరేజ్ గది నిర్మాణం. |
| 4 | HMDA/DEV/EE/Div-III/26/ 2026-27 | 23.10. 2026 | ఎన్టీఆర్ గార్డెన్స్, హైదరాబాద్ లోపల "బహిరంగ వినోద కార్యకలాపాలు" యొక్క సంస్థాపన, ఆపరేషన్స్ మరియు నిర్వహణ కొరకు మూడు (3) సంవత్సరాల కాలానికి ఆపరేట్ చేయడానికి లైసెన్స్ ప్రాతిపదికన ఆపరేటర్ ఎంపిక. |
| 5 | HMDA/DEV/EE/Div-III/27/ 2026-27 | 23.10. 2026 | మూడు (3) సంవత్సరాల కాలానికి ఆపరేట్ చేయడానికి లైసెన్స్ ప్రాతిపదికన "NTR మెమోరియల్ వద్ద పార్కింగ్ స్టాండ్" యొక్క ఆపరేషన్స్ మరియు నిర్వహణ కోసం ఆపరేటర్ ఎంపిక. |

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ 03.11.2026, మ.3.00 గం. వరకు. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in ను సందర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-III, HMDA

DIPR.No.12509-PP/CL/Advt/1/2026-27, తేది: 26.10.2026

వార్త

సగటు మనిషికి తనకు మించిన ఉన్నతిని గురించి తెలియదు. ప్రతిభగలవాడు మేధావిని క్షణాలలో గుర్తిస్తాడు.

- సర్ ఆర్థర్ కొనాన్ డోలీ

# నశా ముక్త్ భారత్ దిశగా....

నిన్నమొన్నటి వరకు అడవుల్లో నక్సలిజాన్ని అంతం చేసేంతవరకు నిద్రపోని కేంద్ర హోమ్‌మంత్రి అమిత్ షా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని భూస్థాపితం చేసేందుకు కంకణం కట్టుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. 2029 డిసెంబరు నాటికి మాదకద్రవ్యాల తుది ఆనవాలు కూడా లేకుండా చేస్తానని శపథం పట్టారు. అందులో భాగంగానే తాజాగా ఈశాన్య భారతంలో వందకోట్ల మాదకద్రవ్యాలను పట్టి, వాటి రవాణా చేస్తున్న 18 మందిని అరెస్టు చేశారు. కేంద్ర హోంశాఖ పట్టు పట్టిందంటే నేరమూలాలను పసికట్టే తీరుతుంది. 2024లోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మాదకద్రవ్య అక్రమ రవాణాపై నిఘాపెట్టారు. తాజాగా ఈశాన్య రాష్ట్రాలలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఛేదించడం ఒక మైలురాయిగా చెప్పుకోవాలి. ఈ నెట్‌వర్క్ 'డెత్ ట్రయాంగిల్ కారిడార్' భారత్, మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా మాదకద్రవ్యాలను అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. దేశ యవనికను గుల్ల చేస్తున్న మాదక ద్రవ్యాల దందాను తుడిచిపెట్టడానికి అమిత్ షా నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలు 'నశా ముక్త్‌భారత్' కేవలం చట్ట అమలుకే పరిమితం కాకుండా, దేశభద్రతను, భవిష్యత్ తరాలను కాపాడే ఒక జాతీయ ఉద్యమంగా మారింది. సరఫరా వ్యవస్థలను పూర్తిగా నిరోధిస్తూ, సరైన ఆర్థిక మూలాలను దెబ్బతీయడం దీని విజయంలో కీలక ఘట్టంగా చెప్పవచ్చు. దేశం మత్తు పదార్థాల నెట్‌వర్క్‌పై అత్యంత కఠినమైన, వ్యూహాత్మక యుద్ధాన్ని ప్రకటిస్తోంది. నశా ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో , రాష్ట్రాల పోలీసు వ్యవస్థలు, కోస్ట్ గార్డ్ వంటి ఏజెన్సీలు ఏకోన్ముఖంగా పనిచేస్తున్నాయి. భవిష్యత్తులో దేశీయంగా , అంతర్జాతీయంగా విస్తరిస్తున్న డ్రగ్స్ ముఠాలను నిర్మూలించేందుకు సుదీర్ఘమైన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక 'విజన్ డాక్యుమెంట్ ఆన్ నార్కోటిక్స్ కంట్రోల్' ను అమల్లోకి తెచ్చారు. గతంలో కేవలం డ్రగ్స్ రవాణా చేసే వ్యక్తులను పట్టుకోవడానికే పరిమితమైన వ్యవస్థ, ప్రస్తుతం డ్రగ్స్ సప్లై చైన్, వాటి ఆర్థిక మూలాలను నాశనం చేయడంపై దృష్టి పెట్టింది. తీరప్రాంతాలు, సరిహద్దుల ద్వారా జరుగుతున్న స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు బిఎస్ఎఫ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ , రాష్ట్రాల నిఘా వర్గాలను బహుళ ఏజెన్సీ సమన్వయ వేదికపైకి తీసుకువచ్చారు. డ్రగ్ మాఫియాకు వెన్నెముకగా ఉన్న ఆస్తుల్ని నిలువరించడం పెద్ద దెబ్బే. 'ఆపరేషన్ ట్రైడెంట్' పేరిట ఈశాన్య రాష్ట్రాల అస్సాం, మిజోరం, మణిపూర్ లలో నిర్వహించిన భారీ దాడుల్లో ఒకేసారి 38 ప్రదేశాలపై దాడులు చేసి, హవాలా మార్గాల ద్వారా జరిగిన 100 కోట్ల నెట్‌వర్క్‌ను ఛేదించారు. అందులో 1,424 బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. గుజరాత్ తీరంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ , నిఘా వర్గాలు జరిపిన మెరుపు దాడిలో ఇరానియన్ బోటు నుండి దాదాపు 526 కిలోల మెథాంఫెటమైన్, హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 2014-2026 మధ్యకాలం వేలకోట్ల రూపాయల విలువైన 1.18 కోట్లకు పైగా కిలోల మత్తు పదార్థాలను భద్రతా బలగాలు జప్తు చేశాయి. 30 రెట్లు పెరిగింది. కేవలం డ్రగ్స్‌నే కాకుండా, ఆ ముఠాల బ్యాంకు ఖాతాలు సస్పెండ్ చేయడం, హవాలా నిధులను స్తంభింపజేయడం వంటి చర్యలు చేపట్టారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గణాంకాల రీత్యా కేసుల నమోదు 181 శాతం పెరిగింది. ఈసారి రూ.17.82 కోట్ల విలువైన ఆస్తుల జప్తు 500 డిటోనేటర్లు, రూ.12లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం,18 మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మిజోరంలోని ఐజ్వాల్, చంఫాయ్, జోఖావ్‌తార్, మణిపూర్‌లోని చురాచంద్‌పూర్, అస్సోంలోని కచార్ ప్రాంతాలలోఅంతర్జాతీయ 'నార్కోహవాలా' నెట్‌వర్క్‌ను కేంద్ర ఏజెన్సీలు, పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై చేపట్టిన ఒక భారీ చర్యలో భాగంగా, అస్సాం, మిజోరం, మణిపూర్‌లలోని 38 ప్రదేశాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. మయన్మార్ నుండి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని 'హవాలా' పద్ధతిలో పరిష్కరించుకుంటున్నారనే ఆరోపణలపై కేంద్ర ఏజెన్సీలు సోదాలు నిర్వహించాయి. సరుకులను తరలించడానికి మయన్మార్ నిర్వాహకులు స్థానిక రవాణాదారులను నియమించుకున్నారు. ఈశాన్య ప్రాంతం నలుమూలల నుండి మాదక ద్రవ్యాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్వీకరించే 'హవాలా' ఖాతాల ద్వారా చెల్లింపులు జరిగాయి. మయన్మార్ నుండి మాత్రమే వచ్చే మెధంఫెట మైన్ సరఫరా ఆగితే తప్ప ఈ అక్రమ రవాణా అంతం కాదు. మిజోరంలోని చంఫాయ్, ఐజ్వాల్, లాంగ్ట్లాయ్ లోని బ్యాంకు ఖాతాలు మాదక ద్రవ్యాల డబ్బును స్వీకరించి, మయన్మార్‌లోని సరఫరాదారులతో పరిష్కరించుకున్నాయని ఈడీ తెలిపింది. అక్టోబరు 23న అస్సాం, మిజోరం మణిపూర్‌లలో ఒక అంతర్జాతీయ నార్కోకార్టెల్‌ను ఛేదించారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్ర పోలీసుల, డైరెక్టరేట్ డైరెక్టర్ల సమన్వయంతో ఈ ఆపరేషన్ జరిగింది. రోజుల తరబడి రహస్య నిఘా సమాచారం చేపట్టిన ఈ సమన్వయ చర్యలో, మిజోరంలోని ఐజ్వాల్, చంఫాయ్,జోఖావ్‌థార్, మణిపూర్‌లోని చురాచంద్‌పూర్, అస్సాంలోని కచార్ ప్రాంతంలోని రవాణా మార్గం వంటి ప్రధాన పట్టణ కేంద్రాలు, సున్నితమైన సరిహద్దు కారిడార్లను సమగ్రంగా కవర్ చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈశాన్య రాష్ట్రాల యువతను డీఎడిక్షన్ సెంటర్‌లకు పంపాలి. వారందరికీ ఉపాధి కల్పన అత్యవసరం. ఎన్ని నెట్‌వర్క్‌లున్నా యువతను మంచి మార్గంవైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఇసుక రేణువులలో ప్రపంచాన్ని, అడవి పువ్వులో స్వర్గాన్ని, అరచేతిలో అనంత దూరాన్ని, ఒక ఘడియలో అనంతకాలాన్ని చూడగలవారు ధన్యులు.



విలియం బ్లేక్

మానవ మేధ స్వేచ్ఛగా ఉన్నప్పుడే సమాజ సంక్షేమానికి నిజమైన భద్రత లభిస్తుంది.



లాస్కీ

# ప్రజావాక్కు

### పునరావృతం కాకూడదు

దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగబ్యాంకుగా పేరొందిన 'భారతీయ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా' (ఎస్.బీ.ఐ)లో ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో లీక్ అయినట్లు వస్తున్న వార్తలు బ్యాంకింగ్ వ్యవస్థ భద్రతపై, ఖాతాదారులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. సున్నితమైన సమాచారం బయటకు వచ్చిందనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం సాంకేతిక లోపంకాదు. ఖాతాదారుల విశ్వాసానికి జరిగిన తీవ్రమైన దెబ్బగా పేర్కొనవచ్చు. డిజిటల్ బ్యాంకింగ్ పేరుతో ప్రజల సమాచారాన్ని సేకరిస్తున్న బ్యాంకులు, ఆడేటాల రక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదు.ఇలాంటి సంఘటనలు ముందు ముందుపునరావృతం కాకుండాపటిష్టంగా సైబర్ భద్రతా చర్యలు చేపట్టడం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు బాధ్యత ఎంతైనా ఉంది.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### వైద్య వస్తువుల ధరలు తగ్గించాలి

అనారోగ్యం వచ్చినప్పుడు మందు కొనగలమా లేదా అనే ఆందోళన ఏ కుటుంబానికీ ఎదురుకాకూడదు. పేటెంట్ పరిధిలో లేని మందులు, వైద్య వినియోగ వస్తువుల ధరలనునియంత్రించాలన్న ప్రతిపాదనఈనేపథ్యంలో సామాన్యులకు ఎంతో ప్రాధాన్యమైనది. రిటైలర్ కొనుగోలు ధరపై గరిష్ఠ చిల్లరధరను 16శాతానికి పరిమితం చేయాలనే సూచన అమలైతే, మందుల ధరల్లో పారదర్శకత పెరిగి రోగులపై ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ధరలనియంత్రణలో సమతుల్యత అత్యంత అవసరం. ఔషధ తయారీసంస్థలు, పంపిణీదారులు, రిటైలర్లకువ్యాపారం కొనసాగించేందుకుసహేతుకమైన లాభం ఉండాలి. మితిమీరిన నియంత్రణ పెట్టుబడులు, ఉత్పత్తి, నిరంతర సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపకుండా ప్రభుత్వం జాగ్రత్తపడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రకృతిని కాపాడుకోవాలి

ప్రకృతి అందాలను ఆస్వాధించే దిశగా ప్రయత్నించాలి. పచ్చనిచెట్లు,చల్లగాలి,రంగురంగులపుష్పాలు, సముద్రపు అలలు, మంచుకొండలు, ప్రసిద్ధిచెందిన పురాతన కట్టడాలు, కోటలు,దేవాలయాలు,చెరువులు,బావులు, కొండకోనలు, జలపాతాలు, పశుపక్ష్యాదులు, సకల జలచరాలు వగైరాఇవన్నీ వీక్షించడం కనులపండుగఅంటే అతిశయోక్తి కాదు. కనుక ప్రకృతిని కాపాడుకోవాలి, ఆస్వాధించాలి.

-ఆర్.వెంకటేశ్ చరన్, బెంగుళూరు

### రెచ్చిపోతున్న సైబర్ నేరస్తులు

ఆధునిక సాంకేతికతను ఆసరాగా తీసుకుని సైబర్ నేరస్తులు రానురాను రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతాల వివ రాలను ఏలా తెలుసుకుంటున్నారో ఆశ్చర్యంగా ఉంది. అయినా మన ఆధార్ కార్డులు, బ్యాంకు ఎకౌంట్ నెంబర్లు, కైవేసి, పాన్‌కార్డు, ఫోన్‌నెంబర్ల వివరాలు రహస్యాలు కాదు. కాని పాస్వవర్డ్, పిన్, ఓటిపిలు ఎవరికి తెలుపకపోయినా క్రిమినల్స్ ఏదోవిధంగా తెలుసుకుని బ్యాంకులోని డబ్బును దొంగిలిస్తున్నారు. సైబర్ క్రిమినల్స్ కోట్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలనుహాక్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇంట్లో దాచుకోలేరు, బ్యాంకుల్లో ఉంచుకోలేరు.ఇక రక్షణ ఎక్కడ?ప్రభుత్వాలు, సైబర్ డిపార్టుమెంటువారు ఇంకా తీవ్రమైన చర్యలు తీసుకోవాలి. యానియన్ బ్యాంకు ఆల్వాల్ బ్రాంచిలో మాసొమ్ము ఏడాదికి పైగా ఫ్రీజ్ చేయబడింది. సంబంధించిన వారందరకు పదేపదే లిఖిత పూర్వక విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోయింది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### చెరువుల పూడిక తీత

చెరువుల పూడిక తీత గ్రామీణ కులవృత్తుల పునరుజ్జీవనానికి ఒక దారి దీపంకానుంది. చిన్న గ్రామపంచాయతీలకు ఆలంబన కానుంది. ఎలా అంటారా కట్ట బాగుపడిన తరవాత కట్ట పొడుగూత ఈత తాటి చెట్లు పెంచి గ్రామపంచాయతీకి ఆదాయ వనరుగా ఉపయోగించొచ్చు.ఇక తెలంగాణలో ఉండే సహజమైన ఎర్రమట్టికి ఈ బలమైన నల్లమట్టి కలిస్తే అద్భుత ఫలితంసాధ్యం అవుతుంది.ఈ ఎల్‌నినోను మీడియా పేపర్స్ మరీ భయంకరంగా చూపుతున్నాయేమో అనిపిస్తుంది. కానీ దీన్ని ఒక అవకాశంగా చూడడమే సమంజసం. ఎందుకు ఈ మాట అనవలసి వస్తున్నది అంటే రైతులు వివిధ రకాల వ్యవసాయ విధానాలవైపు మళ్లుతారు. ఉదాహరణకు డ్రిప్, స్ప్రింకలర్ వ్యవసాయ విధానం కావొచ్చు. మరొక వైపు రైతులు పాడి వైపు మొగ్గు చూపేలా చేస్తుంది.

- భారత అవినాష్, జనగామ

### ఓ ఓటరు మహాశయుడా!

నీకు ఓటు ఇచ్చింది అమ్ముకోమని కాదు, నీకు ఓటు ఇచ్చింది నీ హక్కులను అడగమని సోదరా! నీవు ఐదునిమిషాల ప్రసంగానికి డబ్బులతో నీ ఓటును తాకట్టుపెట్టుకు.అదే ఐదు నిమిషాలలో నీ ఓటు హక్కు పైన ఐదు లక్షలు సంపాదించేవట్టే కదా. ఈ సారైనా నీ ఓటును అమ్ముకోవదు. నీ కుటుంబ శ్రేయస్సు కొరకు వినియోగించుకో.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# చట్ట సభల్లో మార్పు రావాలి

***ఆకర్షణ యుగంగా మారిపోయిన ఈ యుగంలో అభివృద్ధి పేరుతో, సంక్షేమం పేరుతో, టాక్సుల ద్వారా లభ్యమైన డబ్బును విచ్చల విడిగా ఖర్చుచేస్తూ, ఎక్కువ భాగం వారి స్వీయాభివృద్ధికే వినియోగించుకుంటూ పైపైన ప్రజల అభివృద్ధి సంక్షేమం జరుగుతున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఫ్రీ బీలకు లొంగుతున్న ఈనాటి ఓటర్లు ఈ మార్పును క్షుణ్ణంగా పసిగట్టలేక,పార్టీల పెద్దల మాయమాటలకు లోబడుతున్నారు! డీలిమిటేషన్ క్రమ పద్ధతిలో సౌత్ నార్త్ రాష్ట్రాల చరిత్రను దృష్టిలో పెట్టుకొని ఉపక్రమించాలి! అంతేకాని, కేవలం సభ్యులసంఖ్య పెంచినంత మాత్రాన సరియైన ప్రాతినిధ్యానికి సమతుల్యత లభించినట్లు కాదు! పాలకులూ, ప్రతిపక్షాలూ చట్టసభల్లో సరియైన ప్రాతినిధ్యం అన్ని రాష్ట్రాలకూ లభించే విధంగా చర్చల ద్వారా డీలిమిటేషన్ విషయం అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించాలి! అప్పుడే చట్టసభలు అర్థవంతంగా, ప్రయోజనకరంగా ప్రజల బాగోగులను గమనించి చట్టాలు చేయగలవు!***



రావులపాటి సీతారాంరావు

ప్రజాస్వామ్యం పది కాలాల పాటు నిలబడాలంటే పార్లమెంటరీ వ్యవస్థలు సద్వినియోగ పర్చుకోవాల్సిన అవసరం పార్లమెంట్లో పాల్గొనే సభ్యులకు వుంది! అది వారి బాధ్యత కూడా! ఎందుకంటే సుమారు 18 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు కనుక! ఇప్పటి మాటేమో కానీ ఇదివరకు ముఖ్యంగాస్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో పార్లమెంటును పవిత్ర దేవాలయంగా అభివర్ణించే వారు. కేవలం పైకి చెప్పటమే కాదు ఆచరణలో గూడా వారు పార్లమెంటును అంతే చూసేవారు! పార్లమెంటులోని ప్రతినిధి రెండు విధాలుగా తనకు దొరికిన అవకాశాన్ని వినియోగించుకోవాలి! తన కానిస్టిట్యుయన్సీ ఓటర్లు తనను కలిసి వారి కష్ట సుఖాలతో పాటు, ఏయే సౌకర్యాలు ఆనియోజక వర్గానికి కల్పించాలి, రెండవది ఏవిధంగా ఆ విషయాలను పార్లమెంట్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసి తను ప్రాతినిధ్యం వహించే ఓటర్ల న్యాయమైన కోర్కెలను తీర్చేందుకు ప్రయత్నించగలగాలి!? ఈ రెండూ ప్రస్తుతం జరుగుతున్నాయా? ఆ విధంగా ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించే రోజులు పోయాయి! ఓటర్ల ప్రాతినిధ్యం బదులు పార్టీ ప్రాతినిధ్యమే నెరవేర్చటానికి ప్రయత్నిస్తున్నారు. ఆ విధంగా ప్రజాస్వామ్య అసలు సిసలైన విలువలను కాల రాస్తున్నారు! నీతులు ప్రవచించే రాజకీయ నాయకులు అవినీతి కార్యక్రమాలకే వంతపాడుతున్నారు! ఒకటో రెండో మంచి పనులు చేబట్టినా కేవలం అవి ప్రచారానికి మాత్రమే వాడుకుంటున్నారు! ప్రజల లాభం ప్రక్కన పెట్టి, స్వలాభానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. చేసే చట్టాలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించ లేకపోతున్నాయి! 131 రాజ్యాం గం ఎమెండెమెంట్, డీలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టబడింది. ఈ బిల్లు ఆమోదంతో లోక్‌సభలోకి సభ్యుల సంఖ్య 550 నుంచి 853కు పెరుగుతుంది. ప్రస్తుతం మల్కాజిగిరి (తెలంగాణ) నియోజక వర్గంలో 37.8 లక్షల ఓటర్లు వున్నారు. సరాసరి లోక్‌సభ సీటు 18 లక్షల మందికే ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎన్ని రెట్ల సంఖ్య మల్కాజిగిరి సీట్లో ఎక్కువగా ఉందో పరిగణనలోకితీసుకొని విస్మయం చెందినా, ఏం చేసేపరిస్థితి వుంది? లక్షద్వీప్ సభ్యుడికి కేవలం 57,953మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు! ఏ పార్లమెంట్ సభ్యుడైనా కేవలంప్రజాస్వామ్య వ్యవస్థకు చూపులకు ఆభరణంగా మిగలటం వల్ల ఆశించిన ప్రయోజనాలు ఆ నియోజక వర్గానికి లభిస్తాయా? ఏ సభ్యుడికైనా సభలో డిబేట్లలో కాకుండా వేరే రూపంలో పాల్గొనే అవకాశం ప్రశ్నల సమయం,జీరోఅవర్స్ ఉంటుంది. లోక్ సభలో కాలపరిమితి ప్రకారం 20స్టార్డ్ ప్రశ్నలకు ముఖతా జవాబులు లభిస్తాయి. 230 అన్‌స్టార్ ప్రశ్నలకు లిఖిత రూపంలో ఒక సిట్టింగ్ రోజున జవాబులు



దొరుకుతాయి. ఒక సభ్యుడు రోజుకు 5 ప్రశ్నలు వేయవచ్చు. అందులో కొన్నిటినే ఎన్నుకొని స్పీకర్ అనుమతితో జవాబులు ప్రభుత్వం ఇవ్వటం జరుగుతుంది. ఒకవేళ 850కి సంఖ్య పెరుగుతే సభ్యుల ప్రశ్నలకు జవాబులు ఇవ్వటం చాలా తక్కువ అవుతాయి! 17వ లోక్‌సభలోప్రశ్నా సమయం 60 శాతం మాత్రమే వినియోగించు కున్నారు. వర్షాకాల సమావేశంలో (2026) కేవలం 1శాతం మాత్రమే ప్రశ్నా సమయం అందు బాటులోకి వచ్చింది. కేవలం 9 నిముషాలు మాత్రమే మొత్తం సెషన్లో ప్రశ్నలకు సమయం కుదిరింది. జీరో అవర్లో అర్జెంట్ విషయాల ప్రస్తావన వుంటుంది. ఈ సమయాన్ని చాలామంది సభ్యులు వినియోగించుకోనేందుకు ప్రయత్నిస్తారు కానీ స్పీకర్ దృష్టిలో పడ్డ వారికి మాత్రమే ఈ అవకాశం లభిస్తుంది అని అంటారు! డీలిమిటేషన్ జరుగుతే పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో ఇప్పుడే చెప్పటం కష్టం! ప్రజాస్వామ్యంలో శాసనాలు చేసే వ్యవస్థప్రత్యేకంగా రాణించాలి! ప్రజా ప్రతినిధులు, ఓటర్లు ఎన్ను కుంటేనే శాసనాలు చేసే సభలలో పాల్గొనగలరు!

నిజానికి రాజ్యసభలోని సభ్యులను, రాష్ట్రాల శాసనసభ్యులే చాలా వరకు ఇండైరెక్ట్‌గా ఎన్నుకుంటారు. వివిధ రంగాలలో ఆరి తేరిన వారిని, ప్రత్యేకంగా రాష్ట్రపతి, సమాజంలోని భిన్నవర్గాల ప్రతినిధులు గుర్తించి ప్రత్యక్ష ఎన్నికలలో రాలేని వారిని శాసనాలు చేసే సభల్లో అడుగుపెట్టటానికి నామినేట్ చేస్తారు! ఇంతకు ముందు నిజమైన అనుభవం కల్గిన వారికి విభిన్న రంగాలల్లో రాణించిన వారికి ఈ అవకాశం పక్షపాత రహితంగా లభించేది. ఇప్పుడు పార్టీలు ప్రత్యక్ష ఎన్నికలలో గెలుపొందని రాజకీయ నాయకులను, లోక్‌సభలో ఎక్కువ మంది అధికార సభ్యులను నింపటానికి ప్రయత్నించటం వల్ల ఇదివరకటి పారదర్శకత అనుభవజ్ఞుల గుర్తింపు,ఇప్పటి సభల్లో కనపడటం లేదు! నిజమైన మేధావుల స్తబ్దత వల్ల కుహనా మేధావులూ, మానిప్యులేటర్లు ఈ అవకాశాన్ని విరివిగా వాడుకుంటున్నారు. ప్రజలు ఖిన్నులై చూస్తున్నారు! ప్రజాస్వామ్య విలువలు రోజురోజుకూ గొప్ప ప్రజాస్వామ్య దేశాలుగా పేరు తెచ్చుకున్న దేశాల్లో గూడా తగ్గుతున్నాయి! దానికి కారణం ప్రజలు ఓటు విలువను సరియైన అవగాహనతో వినియోగించుకోకపోవటం వల్లనేమో! ఇదివరకు గ్రామ సీమలల్లో చదువు లేనివారే ఎక్కువగా ప్రజాస్వామ్య పరిధులను తప్పకుండా విజ్ఞతతో ప్రతినిధులను ఎన్నుకొనే వారని మిగిలిన కొద్దిమంది ఆనాటి వారు వాపోతుంటారు. ఆకర్షణ యుగంగా మారిపోయిన ఈ యుగంలో అభివృద్ధి పేరుతో, సంక్షేమం పేరుతో, టాక్సుల ద్వారా లభ్యమైన డబ్బును విచ్చల విడిగా ఖర్చు చేస్తూ, ఎక్కువ భాగం వారి స్వీయాభివృద్ధికే వినియోగించుకుంటూ పైపైన ప్రజల అభివృద్ధి సంక్షేమం జరుగుతున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఫ్రీ బీలకు లొంగుతున్న ఈనాటి ఓటర్లు ఈ మార్పును క్షుణ్ణంగా పసిగట్టలేక, పార్టీల పెద్దల మాయమాటలకు లోబడుతున్నారు! డీలిమిటేషన్ క్రమ పద్ధతిలో సౌత్ నార్త్ రాష్ట్రాల చరిత్రను దృష్టిలో పెట్టుకొని ఉపక్రమించాలి! అంతేకాని, కేవలం సభ్యుల సంఖ్య పెంచినంత మాత్రాన సరియైన ప్రాతినిధ్యానికి సమతుల్యత లభించినట్లు కాదు! పాలకులూ, ప్రతిపక్షాలూ చట్టసభల్లో సరియైన ప్రాతినిధ్యం అన్ని రాష్ట్రాలకూ లభించే విధంగా చర్చల ద్వారా డీలిమిటేషన్ విషయం అందరికీ ఆమోద యోగ్యంగా పరిష్కరించాలి! అప్పుడే చట్ట సభలు అర్థవంతంగా, ప్రయోజనకరంగా ప్రజల బాగోగులను గమనించి చట్టాలు చేయగలవు! ●

# చదువు, నైపుణ్యం, ఉపాధి మధ్య పెరుగుతున్న అంతరం

లింగప్రసాద్

దేశం వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలోకి అడుగులు వేస్తున్నప్పటికీ, విద్యను ఉపాధితో అనుసంధానించడంలో ఉన్న సవాళ్లు యువత భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు ఉన్నత విద్యకు ప్రాధాన్యం పెరుగుతుండగా.. మరోవైపు చదువు పూర్తయిన తర్వాత తగిన ఉద్యోగం లభించకపోవడం, నైపుణ్యాలకు సరిపడే అవకాశాలు లేకపోవడం సమస్యగా మారుతోంది. దీంతో విద్యకు ఖర్చు పెరుగుతున్నా.. విద్యకు తగ్గ ఉపాధి అవకాశాలు ఎంతవరకు అందుతున్నాయన్న ప్రశ్న ముందుకు వస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)2025 ప్రకారం 15-29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత రేటు 9.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 8.3శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 13.6 శాతంగా నమోదైంది. యువతలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం పోటీ తీవ్రంగా ఉన్న పరిస్థితిని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం 2025లో మాధ్యమిక విద్య లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన 15 ఏళ్ల పైబడిన వారిలో నిరుద్యోగిత 6.5 శాతంగా ఉంది. 2024లో నమోదైన 7 శాతంతో పోలిస్తే ఇది తగ్గినప్పటికీ, విద్యావంతుల ఉపాధి సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు భావించలేమని నిపుణుల విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) కూడా భారతదేశంలో యువతలో విద్యాస్థాయి పెరుగుతున్నప్పటికీ, వారి విద్యార్హతలకు సరిపోయే ఉపాధి అవకాశాల సృష్టి అంత వేగంగా జరగడం లేదని తన (ఇండియన్ ఎంప్లాయిమెంట్ రిపోర్టు) 2024లో పేర్కొంది. నైపుణ్యాలు, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాల మధ్య అంతరం కూడా సమస్యగా ఉందని నివేదిక విశ్లేషించింది. దేశంలో విద్యా ప్రాప్తి విస్తరించినప్పటికీ, విద్యా నాణ్యతలో సమానత్వం ఇంకా ప్రధాన సవాలుగానే ఉంది. ఎఎస్ఇఆర్ 2024 ప్రకారం గ్రామీణ భారతదేశంలో పాఠశాలల్లో చేరిక రేట్లు 6-14 ఏళ్ల వయసులో 98.1 శాతంగా ఉన్నాయి. అయితే చదవడం, గణితం వంటి ప్రాథమిక సామర్థ్యాల్లో విద్యార్థుల మధ్య ఇంకా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల




ల్లో అభ్యసన స్థాయిలు మెరుగుపడుతున్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలల్లో వ్యత్యాసం పూర్తిగా తొలగిపోలేదని నివేదిక వెల్లడించింది. అందువల్ల పిల్లలను పాఠశాలలో చేర్పించడం మాత్రమే కాదు వారు ఏం నేర్చుకుంటున్నారు, ఆ విద్య భవిష్యత్తులో వారికి ఏ నైపుణ్యాలను అందిస్తోంది అన్నదే కీలకం. సాంప్రదాయ విద్యా విధానంలో డిగ్రీ, పీజీ, పరిశోధన వంటి విద్యార్హతలు సాధించడం మాత్రమే విజయానికి మార్గంగా భావించే పరిస్థితి నుంచి బయట పడాల్సిన అవసరం ఉంది. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, వృత్తివిద్య వంటి అంశాలను విద్యలో మరింత బలంగా అనుసంధానించాల్సిన అవసరం ఉంది.అదే సమయంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగాన్నే లక్ష్యంగా పెట్టుకునే పరిస్థితి కూడా మారాలి. ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామిక రంగం, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, సేవా రంగం, స్టార్టప్‌లు, స్థానిక ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం పెరగాలి. చదువు పూర్తయినా ఉపాధి దొరకకపోవడం యువతలో నిరాశకు కారణమయ్యే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు లేకపోవడం కేవలం వ్యక్తిగత ఆర్థిక సమస్య మాత్రమే కాదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థిరత్వం, యువత భవిష్యత్తు వంటి అంశాలపైనా ప్రభావం చూపే సమస్య. అందుకే విద్యా వ్యవస్థను ఉపాధి మార్కెట్‌తో అనుసంధానం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం, గ్రామీణ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం,స్వయం ఉపాధికి ఆర్థిక, సాంకేతిక సహకారం అందించడం అత్యవసరం. భారతదేశానికి విస్తారమైన యువ జనాభా ఒక గొప్ప అవకాశమైతే, వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, గౌరవప్రదమైన ఉపాధి కల్పించడం పెద్ద బాధ్యత. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యావిధానం కూడా అదే వేగంతో మారాల్సిన అవసరం ఉంది.విద్య కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా జీవితానికి ఉపయోగపడే జ్ఞానం, నైపుణ్యం, ఉపాధి కల్పించే సాధనంగా మారాలి.యువతకు అవకాశాలు కల్పిస్తేనే జనాభాశక్తి ఆర్థికశక్తిగా మారుతుంది. లేకపోతే అదే జనాభా ఒత్తిడిగా మారే ప్రమాదం ఉంటుంది.అందుకే దేశం ముందుకు సాగాలంటే విద్యానాణ్యత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధిసృష్టి, పారిశ్రామికాభివృద్ధి అనేనాలుగుఅంశాలను సమన్వయంతో ముందుకుతీసుకెళ్లాలి. యువతకు చదువు మాత్రమేకాదు చదువుకు తగ్గభవిష్యత్తు కావాలి. ●

# కృత్రిమ బంగారం కోసం ఎదురుచూపులేనా?

వరిగొండ నవీన్‌కుమార్

ప్రపంచంలో వివిధ దేశాల సంపన్నతను వారి దగ్గర ఉండే బంగారు నిల్వలను బట్టి కూడా గణిస్తారు. ఏ దేశం వద్ద ఎక్కువ బంగారముంటే ఆ దేశం గొప్పదనుకునే రోజులివి. ప్రస్తుతం ఇదే అంచనాతో చైనా, పోలాండ్,టర్కీ వంటి దేశాలు విపరీతంగా బంగారం కొంటున్నాయి. అవన్నీ తమ సామాజిక హోదాను పెంచుకోవడానికే. జాతీయభద్రత అనే ఐడియాతో అమెరికా 2025లో బంగారాన్ని స్థిరీకరించింది. అదే అమెరికన్లకు మనో ధైర్యాన్నిస్తుందన్నది తెలిసిందే. అందుకేనేమో అమెరికాకు చెందిన స్టార్టప్ కంపెనీ అణుసాంకేతికత ద్వారా బంగారాన్ని తయారు చేసే సామర్థ్యాన్ని సాధించింది. చిన్నమెత్తు బంగారం చేయగలిగినా ఆ దేశం ఘనకార్యాల్లోకి చేరిపోతుంది. భారతీయులకు పరుసవేది విద్య చిరపరిచితమే అయినా ఆవిద్యకు లోబడి తయారైన బంగారాన్ని ఎప్పుడూ చూసి తరించిన సందర్భాలు ఏమీ తారస పడలేదు. కానీ వేమనకాలంలో బంగారం తయారుచేసే పనిలో వేమన తన జీవితాన్ని త్యాగం చేశారని ప్రతీతి. యోగి వేమన లేదా ప్రాచీన భారతీయ రసవాదులు సిద్ధులు, నాగార్జునుడు వంటివారు పరుస వేది విద్య/ ఆల్కెమీ పాదరసం, మూలికలను ఉపయోగించి బంగారాన్ని తయారు చేసేవారనే ప్రచారం మన దేశంలో శతాబ్దాలుగా ఉంది. వేమన పద్ధతులు,మూలికలు,గంధాలు, సాధారణ రసాయనిక భాగాలు, ప్రత్యేక యోగ మార్గాలతో కూడిన ప్రయోగాలుగా చెబుతారు. అయితే దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేదా పునరావృత నిరూపణలు లేవు. ఇది చాలామందికి ఒక ఆధ్యాత్మిక రహస్యంగా లేదా కల్పనగా మిగిలిపోయింది. భారతీయ రసశాస్త్రంలో 'పరుసవేది' లోహాలను బంగారంగా మార్చే ప్రక్రియతోపాటు మానవ దేహాన్ని ఆరోగ్యవంతంగా, ఆధ్యాత్మిక ఉన్నత స్థితికి చేర్చే భౌతిక రసాయన ఆధ్యాత్మిక సమన్వయానికి ప్రతీకగా అభివర్ణిస్తారు. శతాబ్దాలుగా రసవాదులు కన్న కల, పనికిరాని లోహాలను విలువైన బంగారంగా మార్చాలన్న ఆశయం. సైన్స్‌ఫిక్షన్ కథల్లో చదివిన అద్భుతం.ఇప్పుడు 'హైరెట్ ఆల్కెమీ' రూపంలో వాస్తవరూపం దాల్చింది. మ్యారథాన్ ఫ్యూజన్ 2025లోనే విడుదల చేసిన ఒక పరిశోధన పత్రంలో,వాణిజ్యస్థాయిలో ఒక గిగావాట్ సామర్థ్యం గలఫ్యూజన్ పవర్ ప్లాంట్ ద్వారా ఏటా సుమారు రెండుటన్నుల బంగారం ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేసింది. ఇది నిజమైతే ప్రపంచ బంగారం మార్కెట్‌పై పెను ప్రభావం చూపుతుంది. తాజా తయారీలో బంగారుదిమ్మెలు ఇప్పటికిప్పుడు తయారై మిరుమిట్లుగొలుపుతాయంటే నమ్మలేం. అయితే, ఇవి కేవలం సిమ్యులేషన్ల ఆధారంగా చేసిన అంచనాలు మాత్రమే. వాణిజ్యస్థాయిలో ఫ్యూజన్‌రియాక్టర్లు అందుబాటులోకి రావడానికి ఇంకా దశాబ్దాల సమయం పట్టవచ్చు.అంతేకాక,ఈపద్ధతిలో తయారైన బంగారంలో రేడియో ధార్మిక అవశేషాలు ఉండే అవకాశం ఉందని, దానిని సురక్షితంగా



మార్చేందుకు 14నుంచి 18ఏళ్లు నిల్వ ఉంచాల్సి రావచ్చని నివేదికలు చెబుతున్నాయి. ఇది కేవలంల్యాబ్‌లలో జరిగే అణుప్రక్రియ. దీనిద్వారా పెద్దఎత్తున బంగారాన్ని తయారు చేయడం ప్రస్తుతానికి అత్యంత ఖర్చుతో కూడుకున్నది. కాబట్టి, రేపు పొద్దునే మార్కెట్లోకి ఈ కృత్రిమ బంగారం తన్నుకొచ్చి ధరలు పడిపోతాయని చెప్పలేం. కేవలం బంగారం తయారీ మాత్రమే కాకుండా,క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో ఉపయోగపడే కాపర్64, కాపర్67 వంటి అత్యంత విలువైన వైద్య ఐసోటోప్‌లను కూడా జింక్ నుంచి ఉత్పత్తి చేసినట్టు మ్యారథాన్ ఫ్యూజన్ ప్రకటించింది. మొత్తంమీద, ఒక మూలకాన్ని బంగారంగా మార్చడం శాస్త్రీయంగా సాధ్యమేనని మరోసారి నిరూపితమైంది. సాధారణంగా రసాయనిక ప్రక్రియలతో మూలకాలను మరో మూలకంగా మార్చడం అసాధ్యం. అణుసంలీనం తరహా ప్రక్రియతో మూలకం కేంద్రకంలో మార్పులుచేసి మరో మూలకంగా మార్చేందుకు అవకాశం ఉంటుంది.ఇదే 'న్యూక్లి యర్ ట్రాన్స్ మ్యూటేషన్' అంటారు. ఇప్పుడు ఈ విధానంలోనే పాదరసం నుంచి బంగారిన్న రూపొందించామని, ఇందుకోసం అణుసంలీనం చర్యలో వెలువడిన అత్యంత శక్తివంతమైన న్యూట్రాన్లను వినియోగించామని మ్యారథన్ ఫ్యూషన్ సంస్థ ప్రకటించింది. ఆ వివరాల మేరకు పాదరసం (మెర్క్యురీ -198) మూలకాన్ని అత్యంత శక్తివంత మైన న్యూట్రాన్లతో ఢీకొట్టినప్పుడు దాని పరమాణువుల నుంచి ఒక న్యూట్రానన్ను కోల్పోయి, మెర్క్యురీ -197 ఐసోటోప్‌గా మారింది. ఈ ఐసోటోప్కు రేడియోధార్మిక లక్షణాలు ఉంటాయి.ఈ క్రమంలో స్థిరత్వం కోసం మెర్క్యురీ -197ఐసోటోప్ ఒక ప్రొటాన్ను కోల్పోయి, తర్వాత ఒక శక్తివంతమైన న్యూట్రానన్ను సంగ్రహించి బంగారం 197ఐసోటోప్‌గా మారినట్టు కంపెనీ వెల్లడించింది. యూరోపియన్ యూనియన్‌కు చెందిన అణు పరిశోధన సంస్థ 'సెర్న్' శాస్త్రవేత్తలు 2025లో లార్జ్ హైడ్రాన్ కొలైడర్ (ఎల్‌హెచ్‌సి) పరికరంతో ప్రయోగాలు చేస్తున్న సమయంలో 29 పికోగ్రాముల (ఒక పికోగ్రాము అంటే గ్రాములో లక్షో వంతు) బంగారాన్ని తయారు చేసినట్లు ప్రకటించారు. సీసం (లెడ్) మూలకం నుంచి బంగారం ఉత్పత్తి అయినట్టు తెలిపారు. దానితో పోలిస్తే పదింతలు ఎక్కువగా బంగారాన్ని ఉత్పత్తి చేయగలిగామని మ్యారథాన్ ఫ్యూషన్ సంస్థ తాజాగా పేర్కొంది. ఇలా భారీగా బంగారం తయారు చేయడానికి దశాబ్దాల కాలం పట్టొచ్చు. ఈ పద్ధతి ద్వారా ఉత్పత్తి రేటు 2025లో 'సెర్న్' నెలకొల్పిన రికార్డు కంటే 10 రెట్లు ఎక్కువగా ఉందని కంపెనీ చెబుతున్నది. అయితే ఈ ప్రయోగంలో అసలు ఎంత బంగారం ఉత్పత్తి అయిందనే కచ్చితమైన మొత్తాన్ని కంపెనీ ఇంకా వెల్లడించలేకపోయినా తమ ప్రయత్నాలు ఫలించినట్లు ఘనంగా చెప్పినట్లయ్యింది. ఈ కంపెనీ చెబుతున్న విధానం కేవలం కెమికల్ రియాక్షన్ కాదు, ఇది పూర్తిగా 'న్యూక్లియర్ ట్రాన్స్ మ్యూటేషన్' కేంద్రక రూపాంతరం అనే అణుప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. ఒక ప్రత్యేక ఐసోటోప్ అయిన 'పాదరసం198'ను ఫ్యూజన్ రియాక్టర్‌లోకి పంపిస్తారు. అక్కడ హైడ్రోజన్ ఐసోటోపుల కలయిక వల్ల వెలువడే అత్యంత శక్తివంతమైన న్యూట్రాన్లు ఈ పాదరసాన్ని తాకినప్పుడు, అది అస్థిరమైన 'పాదరసం197' గా మారుతుంది. ఆ తర్వాత ఇది క్రమంగా క్షీణించి స్థిరమైన 'బంగారం197'గా రూపాంతరం చెందుతుంది. భౌతికశాస్త్ర సూత్రాల ప్రకారం ఇది సిద్ధాంతపరంగా సాధ్యమే. గతంలో సెర్న్ (సిఇఆర్ఎన్) లాంటి సంస్థలు కూడా పార్టికల్ యాక్సిలరేటర్ల ద్వారా ఇలాంటి ప్రయోగాలు చేశాయి. ఏది ఏమైనా కనుచూపు మేరలోకి కృత్రిమ బంగారం వాణిజ్యం ఉత్పత్తుల స్థాయికి చేరుకోవడం అసాధ్యమే ! ●

# దేశాలమధ్య అవగాహనకు వారధిగా పార్లమెంట్లు

## బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ ఫోరమ్ సదస్సులో స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడంలో, ఉద్రిక్తతలను తగ్గించడంలో పార్లమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. సోమవారం ఆయన 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను ప్రారంభించారు. సంవిధాన్ సదన్‌లోని చారిత్రాత్మక సెంట్రల్ హాల్‌లో జరిగిన ప్రారంభ సమావేశంలో బిర్లా మాట్లాడుతూ ప్రాంతీయ సంఘర్షణలు, యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం, వాతావరణ మార్పులు వంటి సమస్యలు దేశ సరిహద్దులకే పరిమితం కావని పేర్కొన్నారు. ఇటువంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో చర్చలు, దౌత్యం, పరస్పర సహకారం మరింత ముఖ్యమని చెప్పారు. దేశాల మధ్య పరస్పర అవగాహన, విశ్వాసాన్ని బలోపేతం చేయడంలో, అంతర్జాతీయ ఉద్రిక్తతలను తగ్గించడంలో, ప్రపంచ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడంలో పార్లమెంట్లు ప్రత్యేక పాత్ర పోషించగలవని ఆయన హిందీలో ప్రసంగిస్తూ తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి న్యూఢిల్లీ ఆతిథ్యమిస్తోంది. బ్రిక్స్ పార్లమెంటరీ ప్రతినిధులకు స్వాగతం పలికిన బిర్లా పాత పార్లమెంట్ భవనమైన సంవిధాన్ సదన్‌లో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది బ్రిక్స్ దేశాల్లోనే నివసిస్తున్నారని, ప్రపంచ భూభాగంలో సుమారు మూడో వంతు ఈ దేశాల పరిధిలో ఉందని బిర్లా వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యంలోనూ ఈ దేశాలకు గణనీయమైన వాటా ఉందన్నారు. భౌగోళిక పరిస్థితులు, సంస్కృతి, భాష, సామాజిక వ్యవస్థల్లో విభిన్నత ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువలు, మానవత్వం పట్ల ఉమ్మడి నిబద్ధత బ్రిక్స్ దేశాలను ఏకం చేస్తున్నాయని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన భారత్‌లో జరిగిన బ్రిక్స్ దేశాధినేతల సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన సంయుక్త ప్రకటనను బిర్లా ప్రశంసించారు. ఆ ప్రకటనలో చేసిన కట్టుబాట్లను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాల రూపకల్పన, బడ్జెట్ కేటాయింపులు, చర్చలు, ప్రభుత్వ పనితీరుపై పర్యవేక్షణ ద్వారా పార్లమెంట్లు ఈ లక్ష్యాల సాధనకు తోడ్పడాలని సూచించారు. ఇదిలా ఉండగా, 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ సభ్య, భాగస్వామ్య దేశాల మధ్య చర్చలు, సహకారాన్ని బలోపేతం చేయడంలో పోషించే పాత్రపై ఓం బిర్లా రాసిన వ్యాసాన్ని ప్రధానమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమ వేదికలో ప్రస్తావించింది. ప్రపంచ సహకారానికి కీలక వేదిక బ్రిక్స్‌అని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ప్రపంచ జనాభాలో దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ దేశాలకు, ప్రపంచ మరియు ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఈ వేదిక కీలకమని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ, మానవత్వాన్ని ముందుంచే దార్శనికతను బ్రిక్స్ స్వీకరించిందని హరివంశ్ తెలిపారు. సామర్థ్యాన్ని పెంపొందించడం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం అనే ఇతివృత్తంతో ఈ దార్శనికత రూపొందిందని వివరించారు. ప్రపంచ దక్షిణ దేశాల గొంతుకను మరింత బలోపేతం చేసేందుకు బ్రిక్స్ విస్తరణకు ప్రధాని మోడీ కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో వెలువడిన న్యూఢిల్లీ ప్రకటన ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు, బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థకు మద్దతునిస్తోందన్నారు. ప్రపంచ అభివృద్ధి కోసం సమ్మిళితత్వాన్ని పెంపొందించడంతో పాటు, భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి సభ్య దేశాలు తమ బలాలను సమన్వయం చేసుకోవాలని హరివంశ్ పిలుపునిచ్చారు. 2025 జూన్‌లో బ్రెజిల్ రాజధాని బ్రసీలియాలో జరిగిన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ సందర్భంగా భారత్ ఈ ఫోరమ్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించింది.



# భారీ యుద్ధాల నుంచి రక్షణకు 'కోట' కడుతున్న అమెరికా

### సైనిక బేస్‌లు 90 రోజులపాటు స్వతంత్రంగా పనిచేసేలా పెంటగాన్ వ్యూహం

**వాషింగ్టన్, అక్టోబరు 26:** పశ్చిమాసియా సహా పలు దేశాల మధ్య సుదీర్ఘంగా కొనసాగుతోన్న ఘర్షణలతో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కమ్ముకుంటున్నాయి. అదే జరిగితే అమెరికా భూభాగాన్ని రక్షించుకోవడంతో పాటు యుద్ధాల వేళ పౌర మౌలిక సదుపాయాలపై ఆధారపడకుండా సొంతంగా నిలదొక్కుకునేందుకు సిద్ధమవుతోంది అగ్రరాజ్య మిలిటరీ. ఇందులో భాగంగానే 'ఫోర్ట్రెస్' ప్లాన్‌పై కార్యాచరణను వేగవంతం చేసింది. యుద్ధ సమయాల్లో సరఫరా గొలుసులు, పౌర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నా సరే.. సైనిక బేస్‌లు కనీసం 90 రోజులపాటు స్వతంత్రంగా పనిచేసేలా పెంటగాన్ వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ సంచలన కథనం వెల్లడించింది. 'దేశ రక్షణ చర్యల కోసం సాధారణ పౌర మౌలిక సదుపాయాలపై ఆధారపడాలనుకోవట్లేదు. అది చాలా ప్రమాదం కూడా! ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తే అత్యంత కీలక ఆయుధంగా మారింది. విద్యుత్ లేకపోతే కమ్యూనికేషన్ సాధ్యం కాదు. ఇతర రవాణా సదుపాయాలకూ ఇబ్బందే. అందుకే ఈ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం' అని పెంటగాన్ ముఖ్య అధికారి ప్రతినిధి సీన్ పార్నెల్ చెప్పినట్లు ఆ కథనం పేర్కొంది. అమెరికా భూభాగాన్ని సంరక్షించుకోవడం కోసం అధ్యక్షుడు ట్రంప్ కొత్త విధానాలకు మార్గం సుగమం చేస్తున్నారని పార్నెల్ ఈ సందర్భంగా తెలిపారు. గోల్డెన్ డోమ్, 'ఫోర్ట్రెస్' ప్రణాళికలే అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు.

**పోర్టబుల్ అణురియాక్టర్లు..** ఈ 'ఫోర్ట్రెస్' ప్రణాళికల్లో భాగంగా అమెరికా వ్యాప్తంగా అనేకచోట్ల కీలక సైనిక స్థావరాలను ఏర్పాటు చేయనున్నారు. కనీసం 90 రోజులపాటు స్వతంత్రంగా తమ కీలక కార్యకలాపాలను కొనసాగించేలా వీటిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నిరంతర విద్యుత్ సరఫరా కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ సామర్థ్యం ఉండే బ్యాటరీ వ్యవస్థలు, మైక్రోగ్రిడ్‌లను వినియోగించనున్నారు.



### రైల్వేస్టేషన్ ఆవరణలో కలుపు నివారణకు మేకల నియామకం

#### జపాన్ టోక్యోనగరం రైల్వేస్టేషన్‌లో వింత కార్యాచరణ

**టోక్యో, అక్టోబరు 26:** జపాన్‌లోని టోక్యో నగరంలో ఉన్న యోత్సుయా రైల్వే స్టేషన్‌లో ఓ ఆసక్తికర దృశ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. స్టేషన్ పరిసరాల్లో పెరిగిన కలుపు మొక్కలను తొలగించేందుకు ఈస్ట్ జపాన్ రైల్వే కంపెనీ (జేఆర్ ఈస్ట్) రెండు మేకలను నియమించుకుంది. ఈ పర్యావరణ హితమైన చొరవ ఇప్పుడు ప్రయాణికులకు, స్థానికులకు గొప్ప ఆహ్లాదాన్ని పంచుతోంది. యోత్సుయా స్టేషన్ సమీపంలోని గడ్డి భూమిలో పెరిగిన కలుపు మొక్కలను తినేందుకు పొక్కె, నగి అనే రెండు మేకలను రంగంలోకి దించారు. స్టేషన్ ఉద్యోగి ఒకరు ఇచ్చిన సలహాతో ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 9న విధుల్లో చేరిన ఈ మేకలు, డిసెంబర్ వరకు లేదా కలుపు మొత్తం పూర్తయ్యే వరకు ఇక్కడే పనిచేస్తాయి. రసాయన కలుపు సంహారకాలు వాడటం, యంత్రాలతో అధిక శబ్దం, కాలుష్యం వంటి సమస్యలకు ప్రత్యామ్నాయంగా మేకలను ఉపయోగించడం ఎంతో మేలని జేఆర్ ఈస్ట్ భావిస్తోంది. ఈ మేకల జంట కొద్ది రోజుల్లోనే స్థానికంగా పెద్ద ఆకర్షణగా మారింది. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, అటుగా వెళ్లే పాదచారులు, సమీప పాఠశాల విద్యార్థులు కాసేపు ఆగి వాటిని చూస్తూ మురిసిపోతున్నారు. వాటితో ఫొటోలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. దీంతో స్టేషన్ పరిసరాల్లో ఓ పండుగ వాతావరణం నెలకొంది. నగరం మధ్యలో ఓ మినీ జూను చూసిన అనుభూతి కలుగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మేకల సంరక్షణ బాధ్యతను స్టేషన్ సిబ్బందే చూసుకుంటున్నారు. వాటికి బయటి ఆహారం పెట్టవద్దని, కేవలం కలుపు మొక్కలనే తినేలా చూడాలని ప్రయాణికులకు సూచించారు. పనికి పని, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు ఆహ్లాదం ఇలా ఒకే ఆలోచనతో మూడు ప్రయోజనాలు నెరవేరుతుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జపాన్ ప్రజల వినూత్న ఆలోచనలకు, ఆచరణాత్మక పరిష్కారాలకు ఈ సంఘటన ఒక చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

# పరువునష్టం కేసులో రాహుల్ గాంధీ నిర్దోషి

### కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అమిత్‌షాపై చేసిన వ్యాఖ్యల వివాదం



**లక్నో, అక్టోబరు 26:** కర్ణాటకలో 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల కేసులో దాఖలైన పరువు నష్టం కేసులో ఇవాళ యూపీ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో రాహుల్ గాంధీని యూపీ స్థానిక కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. దీంతో కీలకమైన యూపీ ఎన్నికల వేళ రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమికీ ఊరట లభించినట్లయింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెంగళూరులో జరిగిన ఒక ప్రచార సభలో అప్పటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై యూపీలోని ఆ పార్టీ నేత విజయ్ మిశ్రా పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసులో రాహుల్ 2024 ఫిబ్రవరి 20న కోర్టు ఎదుట లొంగిపోగా, ఆయనకు బెయిల్ మంజూరైంది. 2024 జూలై 26న ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు, ఆ తర్వాత ఫిర్యాదుదారు, ఇతర సాక్షులను విచారించారు. అనంతరం ఈ ఏడాది మార్చిలో రాహుల్ గాంధీ వాయిస్ శాంపిల్‌ను సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ను ట్రయల్ కోర్టు, జిల్లా కోర్టు, అలహాబాద్ హైకోర్టు కొట్టేశాయి. ఈ కేసులో రాహుల్ గాంధీ స్వయంగా ఇవాళ కోర్టుకు హాజరై నిర్దోషిగా విడుదలయ్యారు. అమిత్ షాపై రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి 2018లో నమోదైన క్రిమినల్ పరువు నష్టం కేసులో, యూపీలోని సుల్తాన్‌పూర్‌లో ఉన్న ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు ఆయన్ను నిర్దోషిగా విడుదల చేసింది. ఇవాళ కోర్టు తుది తీర్పు నేపథ్యంలో రాహుల్ స్వయంగా హాజరయ్యారు. మొత్తం 8 ఏళ్ల పాటు సాగిన ఈ కేసులో ఎట్టకేలకు రాహుల్ గాంధీ విడుదల కావడంతో యూపీలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. వచ్చే ఏడాది యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న వేళ రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమిలోని మిత్రపక్ష నేత అఖిలేష్ యాదవ్ బీజేపీపై పైచేయి సాధించేందుకు ఈ తీర్పు వీలు కలిగించింది.

మరోవైపు ఇవాళ ఈ కేసులో హాజరయ్యేందుకు వెళ్తున్న రాహుల్ గాంధీ కాన్వాయ్ లో వాహనాలు ఎక్స్ ప్రెస్ వేపై ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాహుల్ క్షేమంగా బయటపడ్డారు.

# రూ.100 కోట్ల స్కామ్‌లో డిఎంకె మాజీ మంత్రి అరెస్టు



**చెన్నై, అక్టోబరు 26:** ప్రైవేటు స్కూళ్ల 100 కోట్ల కుంభకోణం కేసులో డిఎంకె నాయకుడు మాజీ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొజిని సోమవారం అరెస్టుచేసారు. మద్రాసు హైకోర్టు ఆయన ముందస్తుబెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన వెనువెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వపరమైన క్లియరెన్సులు, గుర్తింపు ఇచ్చేందుకుగాను ప్రైవేటు స్కూళ్లనుంచి భారీ ఎత్తున మంత్రిగా మహేష్ ముడుపులు స్వీకరించినట్లు తెలుస్తోంది. 2021-26 వరకూ మహేష్ పాఠశాల విద్య మంత్రిగాపిచేసారు. సుమారు వెయ్యికిపైగా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలనుంచి పార్టీఫండ్ పేరిట భారీ ఎత్తున ముడుపులు వసూలుచేసారు. శాశ్వత గుర్తింపు, ఇతర పాలనాపరమైన అనుమతులు ఇచ్చేందుకుగాను సుమారు రూ.100 కోట్లకుపైగా ముడుపులు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. చెన్నై పోలీస్ సెంట్రల్ క్రైమ్‌బ్రాంచ్ ఎఫ్ఐఆర్ నమోదుచేసి అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు ముమ్మరంచేసింది. ఈ దర్యాప్తునకు తోడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా కేసున మోదుచేసి మనీలాండరింగ్ నిరోధక చట్టం పరిధిలో దర్యాప్తు ఘుఊచేసింది. అంతకుముందు సెప్టెంబరులో అన్బిల్‌మహేష్ చెన్నై సిసిబి పోలీసుల ముందు హాజరయ్యారు. ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు మోసం కేసుల్లో ఆయన్ను సుదీర్ఘ విచారణజరిపారు. ఎనిమిది గంటలపాటు డిఎంకెనేత కార్యాలయాలు, ఆఫీసులు ఇతర ప్రాంతాల్లో దాడులు సోదాలునిర్వహించింది. చెన్నై, తిరుచిరాపల్లిప్రాం తాల్లోనే ఈ అవినీతి కేసులో సోదాలు నిర్వహించారు. అయితే మహేష్ తనపై నమోదయిన కేసులన్నీ రాజకీయ కక్షతో కూడుకున్నవేనంటూ కొట్టివేస్తూ వచ్చారు. అధికారంలోని టివికె సర్కారు కక్షకడుతోందని ఆరోపించారు. ప్రతి గది, ప్రతి టేబుల్, డ్రాయర్ అతిచిన్న ప్రాంతాలనుకూడా సోదాలు నిర్వహించారని మహేష్ వ్యాఖ్యానించారు.

### హార్ముజ్ కల్లోలంలో దెబ్బతిన్న సూపర్‌టాంకర్లు

**టెహ్రాన్, అక్టోబరు 26:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచి హార్ముజ్ జలసంధి అల్లకల్లోలంగానే ఉంటోంది. ఈ మార్గంలో తరచూ చమురు నౌకలపై దాడులతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. దాడులకు గురైన నౌకల్లో సూపర్ ట్యాంకర్లు కూడా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘర్షణల్లో దాదాపు 3.5 శాతం సూపర్ ట్యాంకర్లు ధ్వంసమైనట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. ఈ యేడాది ఫిబ్రవరి చివరి నాటి నుంచి ఇప్పటివరకు హార్ముజ్ జలసంధిలో దాదాపు 30 వెరీ లార్జ్ క్రూడ్ క్యారియర్లు (వీఎల్‌సిసి) దాడుల కారణంగా దెబ్బతిన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం వీఎల్‌సిసి (900కు పైగా) నౌకల్లో ఈ సంఖ్య దాదాపు 3.5 శాతానికి సమానం. ఒక్క అక్టోబరు నెలలోనే 11 సూపర్ ట్యాంకర్లపై దాడులు జరిగినట్లు ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) వెల్లడించింది. ఈ సూపర్ ట్యాంకర్ ఒక్కోటి 20 లక్షల బ్యారెళ్ల చొప్పున చమురును మోసుకెళ్లంది. డిస్కౌంట్లు, రవాణా వ్యయాల వంటి కారణాలతో ఈ భారీ నౌకల్లో చమురు నింపేందుకు షిప్ యజమానులు ఆసక్తి చూపుతుంటారు. ఉద్రిక్తతల సమయంలో ఈ ట్యాంకర్లు దాడులకు గురైనట్లు ఐఎంఒ వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఈ నెలలో హోర్ముజ్‌లో వాణిజ్య నౌకలపై విపరీతమైన దాడులు జరిగాయి. యుద్ధం మొదలైన నాటి నుంచి అక్టోబరులోనే రికార్డుస్థాయిలో దాడులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఈ జలమార్గంలో 130కిపైగా నౌకలు దెబ్బతిన్నాయి.

### భారత్ పర్యాటకులకు బ్రూనైలో మూడురోజులు వీసా ఫ్రీ టూర్!

**బందర్‌షేరిబేగవాన్,బ్రూనై, అక్టోబరు 26:** ప్రపంచంలో ఎక్కడికెళ్లినా బాటిల్ వాటర్ కంటే పెట్రోల్ ధరే ఎక్కువగా ఉంటుంది. కానీ, ఆగ్నేయాసియాలోని ఓ చిన్న దేశంలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నం. అక్కడ లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు బాటిల్ వాటర్ ధర కంటే చాలా తక్కువ. ఆ దేశమే బ్రూనై. ఇక్కడికి వెళ్లాలనుకునే భారతీయులు మూడురోజుల వరకు వీసా లేకుండానే పర్యటించవచ్చు. ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో బ్రూనై ఒకటి. ముడి చమురు, సహజ వాయువు నిల్వలే ఈ దేశ సంపదకు ప్రధాన ఆధారం. ఈ సంపద ఫలాలను ప్రభుత్వం తన పౌరులకు నేరుగా అందిస్తోంది. బ్రూనై పౌరులు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. వారికి విద్య దాదాపు ఉచితం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటే కేవలం 1 డాలర్ (సుమారు రూ. 83) చెల్లిస్తే చాలు. ప్రభుత్వం ఇంధనంపై భారీగా సబ్సిడీ ఇవ్వడంతో ధరలు అత్యంత చౌకగా ఉంటాయి. అయితే, ఓ ప్రముఖ ట్రావెల్ క్రియేటర్ అంకితా కుమార్ ప్రకారం తాను చూసిన ప్రదేశాల్లో ఇది అత్యంత ప్రశాంతమైన, బోరింగ్ దేశం.

ఇక్కడ నగరాల్లో ఉండే సందడి, నైట్ లైఫ్ లాంటివి దాదాపుగా కనిపించవు. స్థానికులకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంది. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు గానీ, జనసమూహాలు గానీ ఉండవు. దేశంలో 70 శాతం భూభాగం పచ్చని వర్షారణ్యాలతో నిండి ఉంటుంది. ఇక్కడి సుందరమైన మసీదులు, ప్రకృతి అందాలు పర్యాటకులను ప్రధానంగా ఆకర్షిస్తాయి.

# టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసులో ఇంజినీరింగ్ డిప్లొమా హోల్డర్ అరెస్టు

### ప్రధాన నిందితుడు అనిల్ పండిట్ ఆదేశాలతోనే దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడి



**ముంబయి, అక్టోబరు 26:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి 22 ఏళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా హోల్డర్ ప్రాంజల్ థక్రాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో అరెస్టయిన 11వ వ్యక్తి ఇతడే. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు అనిల్ పండిట్ ఆదేశాల మేరకు కాల్పుల ఘటనను అమలు చేయడంలో ప్రాంజల్ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో పాల్గొన్న ఓ షూటర్‌కు రెండో పిస్టల్‌ను కూడా అతడే అందించినట్లు పోలీసులు గుర్తించారు. అమెరికా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అనుమానిస్తున్న అనిల్ పండిట్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. టైగర్ ష్రాఫ్‌పై దాడికి పండితే ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఆ ప్రణాళికను అమలు చేయడం, షూటర్లకు అవసరమైన ఏర్పాట్లు చేయడం, నిధులు సమకూర్చడం వంటి బాధ్యతలను ప్రాంజల్‌కు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు అనిల్ పండిట్, ప్రాంజల్ థక్రాల్‌లు రహస్య మెసేజింగ్ యాప్ ద్వారా పరస్పరం సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ప్రాంజల్ ఫోన్‌లో లభించిన చాట్‌లను విశ్లేషించడంతో పాటు ఆర్థిక లావాదేవీలను పరిశీలించడం ద్వారా అనిల్ పండిట్‌కు సంబంధించిన అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను గుర్తించవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ప్రాంజల్ థక్రాల్ వయసు 22 సంవత్సరాలు. అతడు ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాడు. ఈ ఏడాది మార్చిలోనే జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. అనిల్ పండిట్ ఆదేశాల మేరకు హర్యానాలోని పానిపట్‌లో ఓ వ్యాపారిపై దాడికి పాల్పడిన కేసులో అతడు గతంలో జైలుకు వెళ్లాడు.

జైలు నుంచి విడుదలైన వెంటనే ప్రాంజల్ మళ్లీ అనిల్ పండిట్‌తో కలిసి టైగర్ ష్రాఫ్‌పై దాడికి ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. ముంబైలోని జుహూ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి విదేశాల్లో దాక్కున్న ప్రధాన నిందితుడు అనిల్ పండిట్ ఆచూకీ కనుగొనేందుకు ప్రాంజల్ విచారణ కీలకంగా మారింది.

### నెతన్యాహును గద్దెదించేందుకు విపక్షాలు భారీ వ్యూహం

#### ఇజ్రాయెల్‌లో నేడు సార్వత్రిక ఎన్నికలు

**టెల్‌అవీవ్, అక్టోబరు 26:** ఇజ్రాయెల్‌లో మంగళవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ఆ దేశ భవిష్యత్తుకే కాకుండా మొత్తం పశ్చిమాసియా ప్రాంతానికే అత్యంత కీలకంగా మారాయి. దీర్ఘకాలంగా ప్రధానిగా ఉన్న బెంజమిన్ నెతన్యాహును గద్దె దించేందుకు ఐడీఎఫ్ మాజీ చీఫ్ గాడి ఐజెన్‌కాట్ నేతృత్వంలోని యషార్ పార్టీ తీవ్ర పోటీ ఇస్తోంది. అయితే, నెతన్యాహు ఓడిపోయి ఐజెన్‌కాట్ అధికారంలోకి వస్తే ఇజ్రాయెల్ చేపడుతున్న యుద్ధాలు, పాలస్తీనా ప్రాంతంలోని సమస్యలు పూర్తిగా ముగిసిపోతాయా అంటే వర్తమాన పరిణామాలు, వ్యూహాత్మక విశ్లేషణలు లేదనే స్పష్టం చేస్తున్నాయి. నెతన్యాహుకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న గాడి ఐజెన్‌కాట్ మృదువైన నాయకుడేమీ కాదు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ మాజీ చీఫ్‌గా ఆయన వ్యూహాత్మక మిలిటరీ సిద్ధాంతాలకు పేరుగాంచిన వ్యక్తి. 2006 లెబనాన్ యుద్ధంలో శత్రు స్థావరాలపై విపరీతమైన మిలిటరీ బలప్రయోగాన్ని సమర్థించిన 'దాహియా డాక్ట్రిన్' వెనుక ఉన్నది ఆయనే. స్వయంగా గాజా యుద్ధంలో తన కుమారుడిని, ఇద్దరు మేనల్లుళ్లను కోల్పోయినప్పటికీ, పాలస్తీనా ప్రత్యేక దేశప్రతిపాదనను (టూస్టేట్ సొల్యూషన్) ఆయన పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. హమాస్ సైనిక రూపురేఖలను పూర్తిగా మట్టి కరిపించాలన్నదే ఆయన ప్రధాన లక్ష్యం.

# బ్రెజిల్ అధ్యక్షుడుగా లులా డి సిల్వాకే మళ్లీ పట్టం!



**బ్రాసిలియా, అక్టోబరు 26:** లాటిన్ అమెరికా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం బ్రెజిల్ రాజకీయాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. హోరాహోరీగా సాగిన అధ్యక్ష ఎన్నికల రన్‌ఆఫ్ పోరులో దిగ్గజ నాయకుడు, ప్రస్తుత అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లూలా దా సిల్వా అద్భుత విజయాన్ని సాధించారు. తీవ్రమైన పోటీ నడుమ సాగిన ఈ ఎన్నికల్లో వామపక్ష నాయకుడైన లూలా, తన ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో కుమారుడు, సెనేటర్ ఫ్లావియో బోల్సోనారోను ఓడించి బ్రెజిల్ అధ్యక్షుడిగా నాలుగోసారి బాధ్యతలు చేపడుతున్నారు. సుపీరియర్ ఎలక్టోరల్ కోర్ట్ విడుదల చేసిన అధికారిక ఫలితాల ప్రకారం లూలా దా సిల్వాకు 51.8 శాతం ఓట్లు రాగా, బోల్సోనారోకు 48.2 శాతం ఓట్లు దక్కాయి. దాదాపు 40 లక్షల ఓట్ల తేడాతో లూలా ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. బ్రెజిల్‌లో 1980లలో ప్రజాస్వామ్యం పునరుద్ధరణ తర్వాత, మొదటి విడత ఓటింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన నాయకుడు రన్‌ఆఫ్ పోరులో గెలిచి దేశాధ్యక్షుడు కావడం ఇదే తొలిసారి. అక్టోబర్ 4న జరిగిన మొదటి విడత పోలింగ్‌లో ఫ్లావియో బోల్సోనారో 47 శాతం ఓట్లతో ముందంజలో ఉండగా, లూలా 45 శాతంతో రెండో స్థానానికి పరిమితమయ్యారు.

# సంక్షిప్త వార్తలు

### గిన్నిస్‌బుక్‌లోకి బంగారు జుమ్కాలు..



**దుబాయి, అక్టోబరు 26:** బంగారు ఆభరణాల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దుబాయ్ నగరం మరో అద్భుతమైన ఘనతకు వేదికైంది. ప్రముఖ ఆభరణాల సంస్థ జాయ్‌ఆలుక్కాస్ జ్యువెలరీ రూపొందించిన ఒక జత భారీ బంగారు జుమ్కాలు ఏకంగా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్నాయి. ప్రపంచంలోనే అత్యంత బరువైన, అతిపెద్ద బంగారు చెవిపోగులుగా ఇవి చరిత్ర సృష్టించాయి. ఈ అపురూప ఆభరణాల ప్రదర్శన దుబాయ్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ అద్భుతమైన జుమ్కాలకు మయూర సహస్ర అని పేరు పెట్టారు. సంస్కృతంలో ఈ పదానికి వెయ్యి నెమళ్లు అని అర్థం.

### మలేరియా వ్యాక్సిన్ ధరలు 40 శాతం తగ్గింపు


**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు భారత్ బయోటెక్ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు గావి, యునిసెఫ్‌తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది. ఈ తగ్గింపు 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

### ఆస్ట్రేలియా వీసా రూల్స్ తక్షణమే అమల్లోకి!



**కాన్‌బెర్రా, అక్టోబరు 26:** ఆస్ట్రేలియా వెళ్లాలను కునే భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులకు ఇది ముఖ్యమైన అప్‌డేట్. ఆ దేశ ప్రభుత్వం వీసా దరఖాస్తుల ప్రక్రియలో కీలక మార్పులు చేసింది. వీసా వ్యవస్థను మరింత సురక్షితంగా, పటిష్ఠంగా మార్చే లక్ష్యంతో భారత్‌లోని దరఖాస్తుదారులకు బయోమెట్రిక్ వివరాల సేకరణను తప్పనిసరి చేసింది. ఈ కొత్త నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం కొత్తగా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు తమ వేలిముద్రలతో పాటు ఫేషియల్ ఇమేజ్ కూడా అందించాల్సి ఉంటుంది.

### ఎన్నికల్లో ఓడిన అభ్యర్థికి గ్రామస్తులు రూ.25లక్షల విరాళం



**నాగౌర్, అక్టోబరు 26:** రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో జరిగిన ఓ ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. ఎన్నికల్లో ఓడిపోయిన తమ అభ్యర్థిని, గ్రామస్థులందరూ కలిసి ఏకంగా రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చి సత్కరించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని సామాజిక బంధాలకు, ఐక్యతకు ఈ సంఘటన నిలువుటద్దం పడుతోంది. నాగౌర్ జిల్లా ముండ్వా పంచాయతీ సమితి పరిధిలోని భదౌరా గ్రామ పంచాయతీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి చిడి దేవి అనే మహిళ పోటీ చేశారు. ఆమె ఒక సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు.

### ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలకు మాజీ సిఎం గులాంనబీ కౌంటర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** కశ్మీర్‌పై నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలను మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ తప్పుబట్టారు. ఫరూక్‌పై తనకు గౌరవం ఉందని, అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు సరికావని స్పష్టం చేశారు. పాకిస్థాన్ భారత్‌తో పాటు జమ్మూ కశ్మీర్ ప్రజలకు కూడా శత్రువని అన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ప్రజలు తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్నారని ఆజాద్ గుర్తుచేశారు. అక్కడి పరిస్థితులను చూస్తే పాకిస్థాన్ కశ్మీర్ ప్రజలకు రక్షణగా నిలుస్తోందని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు.



సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

# బిఆర్ఎస్ విషప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ విష ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని, కన్నెపల్లి నుంచి మేడిగడ్డవరకు నీళ్ళు ఎత్తిపోయాలంటే 93.5మీటర్ల నీరు ఉండాలని ప్రస్తుతం 89.20మీటర్ల నీరు మాత్రమే ఉందని కెటిఆర్ ధీమాక్ లేని దీవానా మాటలు మాట్లాడు తున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ 4.5 మీటర్ల నీటి ప్రవాహం తక్కువగా ఉందనీ,మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ళ నీళ్ల పోయాలన్నా ఇదే పరిస్థితి ఉందనీ ఆయన అన్నారు.

కృష్ణా నదిలో 299 టిఎంసిలకు ఒప్పుకున్నదే బిఆర్ఎస్ ప్రభుత్వం అని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ చేసిన తప్పిదాలతోనే తెలంగాణకు దరిద్రం పట్టిందనీ బిఆర్ఎస్ గోదావరి జలాలపై దుష్ప్రచారం చేస్తోందనీ దేవాదుల,సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ గురించి బిఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదనీ అన్నారు. గోదావరి నీళ్లను ప్రభుత్వం వాడుకుంటోందనీ కెటిఆర్,హరీష్ రావు ప్రజలు అధికారం ఇవ్వలేదని రాజకీయ విమర్శలు చేస్తున్నారనీ అన్నారు. 24 గంటలు రాజకీయాలు చేయడం కెటిఆర్,హరీష్ రావు అజెండా అని ఆగ్రహం వ్యక్తంచేశారు..

10 ఏళ్ల అధికారంలో ఉండి రోజు సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచిన కాబట్టి ఏం మాట్లాడినా ప్రజలు నమ్ముతారని కెటిఆర్ భ్రమపడి అనుకుంటున్నారేమో ఆయన ఏం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.అసలు నీళ్ల ఆంధ్రకి పోవడమే లేదు.బొగ్గు, నీళ్లు, పవర్ పై బిఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే నేడు ఇలాంటి పరిస్థితి వచ్చిందనీ అన్నారు.

150 ఏళ్ల తర్వాత ఎల్ నినో విపత్తు వచ్చింది.ఎల్ నినో పై ఎప్పటికప్పుడు సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు రివ్యూలు చేస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారుఈ నెల 28న భట్టి ఆధ్వర్యంలో ఎల్ నినో పై అఖిలపక్ష సమావేశం ఉంది ఈ సమావేశానికి అన్ని పక్షాలు హాజరై ప్రభుత్వానికి తగిన సలహాలు,సూచనలు ఇస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు.



మహంకాళి ఆలయంలో వనదుర్గ మహారుద్ర యాగం నిర్వహిస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

# ఆలయాల్లో దేవాదాయ శాఖ వరుణ యాగాలు నిర్వహించాలి

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సోమవారం మహా వరుణ యాగం నిర్వహించారు.రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అంబర్‌పేట మహంకాళి ఆలయంలో వరుణ యాగం, వరుణ జపం, వనదుర్గ మహారుద్ర యాగం నిర్వహించారు.అంతకు ముందు ఆలయంలో కొలువుతీరిన శ్రీ మహంకాళి అమ్మవారికి విహెచ్ హారతి ఇచ్చి ఆశీర్వదం తీసుకున్నారు. పలువురు వేదపండితులు, రుత్వికులు ఈ వైదిక క్రతువును నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ వరుణ యాగం వెనుక ఉన్న వేల ఏళ్ల చరిత్రను వివరించారు.తాను నిర్వహిస్తున్న వరుణ యాగం ఈనెల 28వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు.వర్షాలు కురవాలని రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహించాలన్నారు. ఇందు కోసం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, సీనియర్ కాంగ్రెస్ నేతలు గరిగంటి రమేష్, గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసుల అదుపులో నిందితుడు

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వరుసబాంబు బెదిరింపులు

## చెన్నైలో నిందితుడి అరెస్ట్

**హైదరాబాద్ (శంషాబాద్) అక్టోబరు 26, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వరుసగా నకిలీ బాంబు బెదిరింపు ఈమెయిల్స్ పంపుతున్న నిందితుడిని ఎయిర్‌పోర్ట్ పోలీసులు చెన్నైలో అరెస్ట్ చేశారు. చెన్నైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శరత్ సుబ్రహ్మ ణ్యం(45)గా నిందితుడిని గుర్తించి, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో డీఎంకే నాయకులపై కోపంతోనే బాంబు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. 2025, 2026 సంవత్సరాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సుమారు 45 నకిలీ బెదిరింపు మెయిల్స్ పంపినట్లు, దేశవ్యాప్తంగా వివిధ విమానాశ్రయాలకు కలిపి సుమారు 800 బెదిరింపు మెయిల్స్ పంపినట్లు పోలీసులు గుర్తించారు. ప్రత్యేక బృందం చెన్నైలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు.

# విద్యుత్, నీరు పొదుపు చేయాలి

## రబీలో ఆరుతడి పంటలే మేలు

## రైతుల్లో విద్యుత్ శాఖ అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులతో మారుతున్న వాతావరణ, వ్యవసాయ పరిస్థితుల నేపథ్యంలో ఆదాయాలను మెరుగుపరచుకునేందుకు తక్కువ విద్యుత్, నీరు, పెట్టుబడి అవసరమయ్యే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై దృష్టిసారించాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది. విద్యుత్, నీటి కొరత నేపథ్యంలో సాంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రైతాంగంలో విద్యుత్, నీటి నిర్వహణ, రబీ సాగు తదితర అంశాలపై రైతాంగంలో అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ మార్పులు మరియు ఎల్ నినో వల్ల కలిగే ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, రైతులు స్థానిక పరిస్థితులకు అనువైన ఆధునిక, నీటి పొదుపు సాగు పద్ధతులను అవలంబించాలని సూచిస్తున్నారు.

కేవలం అధిక నీటి వినియోగం గల వరిపైనే ఆధారపడకుండా, ఒకటి లేదా రెండు గుంటల లేదా లేదా రెండు ఎకరాల భూమిలో కూరగాయలు, ఆకు కూరలు, పూలను సాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకండా వ్యవసాయ అనుబంధ ఆదాయ వనరులుగా పాడి, మత్స్య పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం చేపట్టాలని రైతుల్లో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.

విద్యుత్, నీరు, పెట్టుబడి, శ్రమను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా రైతులు లాభదాయకతను పెంచుకోవచ్చని అని పేర్కొంటున్నారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత వరకూ పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. చిన్న కమతాల కోసం పంటల వైవిధ్యం, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం, నీటిని సమర్థ వంతంగా వినియోగించడం వంటి వినూత్న వ్యవసాయ పద్ధతులపై ప్రచారం చేస్తున్నారు.

# దళితుల ఆత్మగౌరవానికి ఇందిర స్ఫూర్తితో పోరాడుదాం

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** దళితుల ఆత్మగౌరవం కోసం ఇందిరాగాంధీ ఇరువై సూత్రాల పథకం స్ఫూర్తితో పోరాటం చేసి ఆర్థిక స్వావలంభన పొందేందుకు దారులు వేసుకొందామని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. గాంధీభవన్‌లో సోమవారం ధీనబంధు కార్యక్రమములో బాగంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎస్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్‌సిల ఆర్థిక స్వావలంభన ఆత్మగౌరవం జీవనోపాదుల అంశాలను టిపిసిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ , మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణడాక్టర్ గడ్డం శ్రీనివాస్ వివరించారు. ధళితుల సమస్యలపై వచ్చిన పిర్యాదులను స్వీకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సోలోమన్ బాబు రాష్ట్ర కార్యదర్శి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడు తూ దేశంలో సామాజిక సమానత్వం కాంగ్రెస్‌తో మా త్రమే వస్తోందని తెలిపారు. రాజ్యంగం ప్రమాదంలో పడిందని ఓటు హక్కు చోరి అవు తోందని ఆందోళన వ్యక్తంచేశారు.

**ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతలతో మహేశ్‌కుమార్ భేటీ**

ఆదిలాబాద్ జిల్లా నాయ కులతో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి తదితరులు సమావేశమైనారు. జిల్లాలో త్వరలో నియమించబోయే సహకార సంఘాల ఛైర్మన్‌ల నియామకాలు ఇతర రాజకీయ అంశాలపై చర్చించారు. గత పదేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అన్యాయం జరగనీయమని తెలిపారు. పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు. రాబోయే ప్రతిఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం కృషిచేయాలని హితవు చెప్పారు.



గాంధీభవన్‌కు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి తెలంగాణ అబ్జర్వర్ అవినాశ్ పాండే సోమవారం తొలిసారి రావడంతో ఆయనకు శాలువా కప్పి సన్మానించిన పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

# తుఫాను ప్రభావిత జిల్లాల్లో అప్రమత్తం

## విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని తమ సంస్థ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో పనిచేయాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి బి వరుణ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అత్యవసర మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొరగడం వంటివి జరిగితే వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు వాహనాలు, ఏజెన్సీలు విద్యుత్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, సరఫరాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షి స్తూ, తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న జిల్లాల్లో అన్ని సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యంతెగిపడిన విద్యుత్ తీగలు, నీట మునిగిన విద్యుత్ పరికరాల వద్ద ప్రజలు వెళ్లకుండా అవసరమైన హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు.

# అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడి అరెస్ట్

## నకిలీ లింకుల ద్వారా ఖాతాల నుండి రూ. 4.20 లక్షలు కాజేసిన నిందితుడు

## గుజరాత్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న బేల పోలీసులు

**బజార్‌హత్నూర్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** వాట్సాప్‌కు నకిలీ లింకులు పంపి బాధితుల బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల నుంచి లక్షలాది రూపాయలు కాజేస్తున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని ఆదిలాబాద్ జిల్లా బేల పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా అరెస్ట్ చేశారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కేసుకు సంబంధించిన సమగ్ర వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడిస్తూ.. బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంగిడి గ్రామానికి చెందిన ఒక బాధితుడి వాట్సాప్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నకిలీ లింక్ వచ్చింది. దానిని నిజమైన సర్వీస్‌గా నమ్మిన బాధితుడు రూ. 2,200 చెల్లించగా, అనంతరం ఆయన అనుమతి లేకుండానే క్రెడిట్ కార్డుల నుంచి మొత్తం 16 విడతల లావాదేవీల ద్వారా రూ. 4,20,210 నగదు డెబిట్ అయింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బేల పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, బ్యాంకింగ్ లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నిందితుడు దినేష్ పటేల్ (23)ను గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించిన జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు తక్షణ చర్యల ద్వారా బాధితుడి ఖాతాలోని రూ. 2 లక్షలను ఫ్రీజ్ చేయించి, కోర్టు అనుమతితో తిరిగి బాధితునికి అందజేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు దినేష్ పటేల్ నకిలీ పేర్లతో సేకరించిన సిమ్ కార్డులను ఉపయోగిస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్ వేదికల ద్వారా కాల్ గర్ల్స్, అమ్మాయిల వలపు సేవల పేరుతో ప్రకటనలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నట్లు వెల్లడైంది. బాధితుల నుంచి మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా నగదును మళ్లించడంతో పాటు, క్రెడిట్ కార్డుల ద్వారా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ వేదికల నుంచి గిఫ్ట్ కార్డులను కొనుగోలు చేసి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేవాడని ఎస్పీ వివరించారు. నిందితుడిపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 220 సైబర్ ఫిర్యాదులు, తెలంగాణలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, వనస్థలిపురం, నార్సింగి స్టేషన్లతో కలిపి 20 ఫిర్యాదులు నమోదైనట్లు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి సైబర్ నేరాలకు వినియోగించిన 3 మొబైల్ ఫోన్లు, ఒక మినీ ఐప్యాడ్, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




సోమవారం ఆదిలాబాద్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్

# నైని బ్లాక్ నుండి జెన్కోకు బొగ్గు రవాణా సమయం పెంపునకు ఒడిశా గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** రాష్ట్ర విద్యుత్ జెనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)కు సింగరేణికి చెందిన నైని బ్లాక్ నుండి బొగ్గు రవాణా చేసే సమయాలను పెంచుతూ ఒడిశా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జెన్కో సిఎండి డాక్టర్ ఎస్ హరీష్ సోమవారం బొగ్గును రవాణా చేసేందుకు వీలుగా సమయాలను పొడిగించే విషయమై ఒడిశాలోని అంగుల్ జిల్లా కలెక్టర్‌తో భేటీ అయ్యారు. నైనీ బ్లాక్ నుండి ఈ ఏడాది అగస్టు నుండి జెన్కో నేతృత్వంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు రవాణా అవుతోంది. బొగ్గు రవాణాకు స్థానిక అధికార యంత్రాంగం అర్ధరాత్రి 12 గంటల నుండి తెల్లవారు జామున 4 గంటల వరకూ మాత్రమే అనుమతిస్తున్నందున, లక్ష్యాలకు అను గుణంగా బొగ్గు రవాణా జరగడం లేదు. ఈ సమస్యను జెన్కో సిఎండి హరీష్ అక్కడి జిల్లా కలెక్టర్‌కు వివరించగా రాత్రి 11 గంటల నుండి తెల్లవారు జామున 5 గంటల వరకూ 6 గంటల పాటు, రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాకు అనుమతిం చేందుకు అంగీకరించారు.

# ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు యాజమాన్యం అండ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** విధినిర్వహణలో ఉండగా ప్రయాణికురాలి దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపో ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళికకు సంస్థ యాజమాన్యం భరోసా ఇచ్చింది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ ఈడీ సిహెచ్.వెంకన్న ఆమెను పరామర్శించారు. అక్కడ ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకోవాలని వెంకన్న కోరారు.

# తుమ్మిడిహట్టి చర్చలపైన హరీశ్‌రావు అక్కసు

## ప్రభుత్వ విప్ విజయరమణారావు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సానుకూల చర్చలు జరపడంపై హరీష్ రావు అక్కసు వెళ్లగక్కు తున్నారని ప్రభుత్వ విప్ విజయ రమణారావు విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. తుమ్మిడిహట్టి ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ఒప్పుకుంటుం దోనన్న ఆందోళనలో హరీశ్‌రావు, బిఆర్ఎస్ పార్టీ ఉన్నాయని విజయరమణారావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్, కరీంనగర్‌తో పాటు ఇతర జిల్లాలకు మేలు జరిగితే తమ అడ్రస్ గల్లంతు అవుతుందన్న భయం బిఆర్ఎస్‌కు పట్టుకుందని ఆయన ధ్వజమెత్తారు.

లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయినా హరీష్ రావులో ఏ మాత్రం మార్పు లేదని విజయ రమణారావు నిప్పులు చెరిగారు. తుమ్మిడిహట్టిపై హరీష్ రావు లేవనెత్తిన పలు అంశాలపై ప్రభుత్వ విప్ విజయరమణారావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నిర్మిస్తే ఉమ్మడి ఆదిలాబాద్‌లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం అదే విధంగా గిరిజనులు, ఆదివాసీలు దశాబ్దాలుగా సాగు,తాగు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కెసిఆర్ వాళ్లకు ఎందుకు నీళ్లివ్వలేదు? తుమ్మిడి హట్టికోసం మహారాష్ట్రసిఎంకు లేఖరాశారు కేంద్రజలశక్తి మంత్రిని కలిసారు, సిడబ్ల్యుసితో చర్చలు జరిపారు తాజాగా సంకేతిక నివేదిక సమర్పించారు రేవంత్‌రెడ్డి కాలయాపన చేశారంటారా? స్వతంత్ర అధ్యయనం, సంయుక్త కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సానుకూలంగా స్పందించింది. ఇది కాలయాపన ఎలా అవుతుంది? అని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టిని వదిలి కాళేశ్వరానికి ఎందుకు వెళ్లారు? పాత ప్రాజెక్టు అంచనా రూ.38,500 కోట్లు. రీడిజైన్ తర్వాత రెండు ప్రాజెక్టుల ఉమ్మడి ప్రారంభ అంచనా రూ. 85,652 కోట్లకు పెరిగింది. ఏటా అదనంగా రూ.3,555 కోట్ల విద్యుత్ ఖర్చు పెరిగే పరిస్థితిని కాగ్ గుర్తించింది. కమీషన్ల కోసమే రీడిజైన్ చేశారన్న ఆరోపణలకు ముందు సమాధానం చెప్పండనీ ఆయన డిమాండ్ చేశారు.

# వాల్మీకి జయంతి శుభాకాంక్షలు

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్‌శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, భారతీయ సంస్కృతి, సాహిత్యానికి మహర్షి వాల్మీకి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.



డిజిపి కార్యాలయంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్ సహా ఇతర అధికారులు.

# డిజిపి కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు. చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి, సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని మహేష్ భగవత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) జె. అన్యోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వర రావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేల పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై తెలంగాణ రైతుకు అంతర్జాతీయ పురస్కారం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతు ఒకరికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. నిరంతరం నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రీయ వ్యవసాయమే ధ్యేయంగా కృషి చేస్తున్న ఖమ్మం జిల్లా మధిర మండలం, నిదానపురం గ్రామానికి చెందిన రైతు వెట్టివెల్ల సురేంద్రరెడ్డిని ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. గోవా రాజధాని పనాజీలో ఆసియా పీజీపీఆర్ సొసైటీ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్, గోవా ప్రభుత్వ వ్యవసాయ కళాశాల సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో సురేంద్రరెడ్డికి ఈ పురస్కారాన్ని అందచేశారు. ప్రకృతి వ్యవసాయం, నేల సారాన్ని పెంచడంలో ఆయన అవలంబిస్తున్న ఉత్తమ సాగు పద్ధతులు, పర్యావరణ హిత వ్యవసాయ విధానాలను గుర్తించిన సదస్సు నిర్వాహకులు ఆయనకు ప్రోగ్రెసివ్ ఫార్మర్ అవార్డు ను అందజేసి సత్కరించారు.



కొమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ గిరిజన ఐక్యవేదిక నేతలు

# కొమురంభీం ఆశయాల సాధనకై కృషి చేద్దాం

## వర్ధంతి కార్యక్రమంలో పలువురు వక్తలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఆదివాసీ గిరిజన హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన కొమురంభీం ఆశయాల సాధనకై కృషి చేద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం కొమురంభీం వర్ధంతి కార్యక్రమం ట్యాంక్‌బండ్‌పై కొమురంభీం విగ్రహం వద్ద తెలంగాణ గిరిజన ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కే.వివేక్ వినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ కమీషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి ఎం.మోహన్‌బాబు, ప్రముఖ సినీదర్శకుడు అల్లాని శ్రీధర్ హాజరై కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జల్ జమీన్ జంగల్ హక్కుల సాధనతోపాటు ఆదివాసీల కోసం కొమురంభీం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన చేసిన పోరాటాల ఫలితంగానే ఆదివాసీలకు గుర్తింపు వచ్చిందని, ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని గుర్తు చేశారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వివేక్ వినాయక్ మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం బ్రిటీష్ పాలకులను ఎదురించి, ప్రాణత్యాగం చేసిన కొమురంభీంకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీలను వేరుచేసి, ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆదివాసీలకు ప్రత్యేక ఆదివాసీ బందు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, అదిలాబాద్ జిల్లాలో ప్రత్యేక గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక నాయకులు సోయం ప్రభాకర్, సోయం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజన కళాకారులు తమ నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో ఆహుతులను అలరించారు.




# అత్యల్ప పంపిణీ నష్టాలకు ట్రాన్స్‌కోకు అవార్డు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** దక్షిణాది రాష్ట్రాల్లో అత్యల్ప పంపిణీ నష్టాలను నమోదు చేసినందుకు రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలో జరిగిన పవర్‌లైన్ ట్రాన్స్‌టెక్ ఇండియా యుటిలిటీ అవార్డ్స్ కార్యక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ అవార్డును అందుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో 2.20 శాతం ట్రాన్స్‌మిషన్ నష్టాలను నమోదు చేసిందని ట్రాన్స్‌కో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఇది 2024-25లో 2.19 శాతం, 2023-24లో 2.30 శాతంగా ఉందని పేర్కొంది.

## సిఇసిని మోడీ ప్రభుత్వం కాపాడుతోంది

### ఎఐసిసి చీఫ్ మల్లికార్జున్‌ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల మార్గాలను ఉపయోగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఓటు చోరీకి సంబంధించి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని ఖర్గే అన్నారు. అయినప్పటికీ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరితే, ఎన్నికల సంఘం వాణిజ్య రహస్యాలు అనే కారణంతో సమాధానం ఇవ్వడానికి నిరాకరించిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పారదర్శకత అవసరమని డిమాండ్ చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 16.18 లక్షల ఫామ్6 దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బహిరంగంగా వెల్లడించలేదని ఆరోపించారు. పిలిభిత్ జిల్లాలో 10,470 మంది ఓటర్ల రికార్డుల్లో అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్6, ఫామ్7, ఫామ్8 దరఖాస్తులపై విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఓటరు జాబితాల్లో కొత్తగా పేర్లు చేర్చడం, తొలగించడం, వివరాల్లో మార్పులు చేయడం వంటి ప్రక్రియల్లో ఈ ఫారాలు కీలక పాత్ర పోషిస్తాయి. బీజేపీకి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందన్నది ఇండియా కూటమి ఆరోపణ అని ఖర్గే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు ప్రధాన డిమాండ్లను ముందుకు తెచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని తమ డిమాండ్లుగా ఖర్గే వెల్లడించారు.

## మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా

### మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే 13 యూనివర్సిటీలతో ఐక్య ఉద్యమం

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 26, ప్రభాతవార్త :** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో తెలంగాణలోని 13 యూనివర్సిటీల నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట నిర్వహించిన లంచ్ అవర్ నిరసన విజయవంతమైంది. వివిధ విభాగాలు, కళాశాలలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కాంతం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగులకు కనీస ప్రయోజనాలు కూడా అందకపోవడం బాధాకరమన్నారు. ఓ.యూలో జరుగుతున్న శ్రమదోపిడి ఎంకెన్నాళ్లని ప్రశ్నించారు. దశాబ్దాలుగా నలిగిపోతున్న ఓ.యూ ఉద్యోగులను పట్టించుకోవడంలేదన్నారు. జీతాలు పెంచరని, పెన్షన్లు, సిపిఎస్ అమలు, ఓపిఎస్‌లేనే లేవన్నారు. ఈపీఎఫ్ కూడా రావడంలేదన్నారు. ఇప్పటికైన వైస్ ఛాన్సలర్, అధికారులు మానవీయ దృక్పథంతో స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే 13 యూనివర్సిటీల ఉద్యోగ సంఘాలను సమన్వయం చేసి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఐక్య ఉద్యమం చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సులోచన, జైరాం, యాకేష్, ఏశ్వంత్, మియా జానీ, పరమేష్ తదితర రాష్ట్రస్థాయి నాయకులతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జేఏసీ చైర్మన్ కుమార్, ఖదీర్ ఖాన్, వెంకటేష్, నాగ రాజారావు, అక్బర్ బేగ్, పవన్, అఫ్సర్ బేగ్, నారాయణ, యారాల రాజేష్, అంజి, ఉపేందర్, పవన్‌కుమార్, యొయుద్దీన్, విఠల్ గౌడ్‌తో పాటు వందలాదిగా ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్వేష ప్రసంగాల బిల్లు ఉపసంహరించుకోవాలి

### బిఆర్ఎస్ డిమాండ్

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** విద్వేష ప్రసంగాల బిల్లు ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెలెక్ట్ కమిటీ ఛైర్మన్‌కు లేఖ రాసింది. బిల్లుపై రాజ్యాంగపరమైన ఆందోళనలతో పాటు 10 ఏళ్ల జైలు శిక్ష, బెయిల్ లేని నేరాల నిబంధనలను ప్రశ్నించింది. ప్రతిపక్షాలు, మీడియాను అణచివేసేలా బిల్లు మారవచ్చని లేఖలో ఆందోళన ఆందోళన వ్యక్తం చేసింది.

## కుప్పకూలిన సెర్బియా వుచిచ్ ప్రభుత్వం

**బెల్‌గ్రేడ్, అక్టోబరు 26:** అవినీతి, బంధుప్రీతి, పక్షపాతం, అధికార దుర్వినియోగం, అక్రమాలకు వ్యతిరేకంగా పలు దేశాల్లో జరుగుతున్న విద్యార్థుల ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వాలు వరుసగా కుప్పకూలుతున్నాయి. ఇప్పటికే మన పొరుగునే ఉన్న బంగ్లాదేశ్, నేపాల్ వంటి చోట్ల ప్రభుత్వాలను జెన్ జీ విద్యార్థులే కుప్పకూల్చారు. ఈ రెండు దేశాల్లోనూ విద్యార్థి నిరసనలు చోటు చేసుకోవడం, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వాలు కుప్పకూలడం చూశాం. ఇప్పుడు ఐరోపా దేశమైన సెర్బియాలో అయితే ఏకంగా నిరసనలతో మొదలైన విద్యార్థుల పోరు ఎన్నికల్లో పోటీ చేసి దశాబ్దకాలంగా పాలిస్తున్న నియంత సర్కార్ ను కుప్పకూల్చింది. సెర్బియా పార్లమెంట్ ఎన్నికల్లో తీవ్ర సంచలనం నమోదైంది. దాదాపు దశాబ్ద కాలంగా ఆ దేశ రాజకీయాలపై బలమైన ఆధిపత్యం చెలాయించిన అధ్యక్షుడు అలెక్సాండర్ వుచిచ్ తన ఓటమిని అధికారికంగా అంగీకరించారు. అక్కడ యువత, విద్యార్థుల మద్దతుతో బరిలోకి దిగిన స్టూడెంట్ లిస్ట్ కూటమి చారిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ ఫలితంతో తూర్పు ఐరోపా రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాగా, సుదీర్ఘ కాలం పోరాడిన విద్యార్థులు ఇప్పుడు అక్కడ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. 2024లో నోవి సాడ్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం కూల్చివేత ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో సెర్బియాలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు తీవ్రమయ్యాయి. పాలనలో పెరిగిపోయిన అవినీతి, పారదర్శకత లేకపోవడంపై యువత సుదీర్ఘకాలం నిరసనలు తెలిపింది.

# అక్రమ మిల్లర్లపై కొరడా

### ఆస్తులు జప్తు, క్రిమినల్ కేసులు నమోదు!

### దొడ్డు బియ్యం సిఎంఆర్‌కు అనుమతించిన అధికారులపై ఆరా

**హైదరాబాద్, అక్టోబరు 26,ప్రభాతవార్త:** సన్నబియ్యం కామన్‌వెరైటీ కింద ఎఫ్‌సిఐకి చెల్లించకుండా అక్రమాలకు పాల్పడిన మిల్లరపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కొరఢా విదిలించడంతో మిల్లు యజమానుల్లో మాత్రమే కాదు అందుకు సహకరించిన ఎఫ్‌సిసిఐ సివిల్‌సప్లయ్ అధికారుల్లో వణుకు పుడుతోంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి దొడ్డు బియ్యం తక్కువకు కొనుగోలు చేసి, పాలీష్ చేసి ఇచ్చి మిల్లర్లకు రికవరి నోటిసులు జారీచేయడంతోపాటు ఆస్తుల జప్తు క్రిమినల్ కేసులు నమోదుకు ప్రభుత్వంకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సన్నబియ్యం చీకటి మార్గం పట్టించి ప్రభుత్వానికి క్వింటాల్‌కు 520 (బోనస్‌తోపాటు కామన్‌వెరైటీ ప్రకటన వల్ల కలిగే నష్టం) రూపాయల చొప్పున ఆర్థిక నష్టం చేసిన మిల్లర్లు, అధికారగణంపై ఉక్కుపాదం మోపే కార్యాచరణ పౌరసరఫరాలశాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇతర నిఘా వర్గాలతో కాకుండా సిబిడికి ఫిర్యాదు చేసి మిల్లర్లను అరెస్టు చేయించడం వెనుక దీనికి తోడ్పాటు అందించిన అధికారగణంను కూడా బాధ్యులు చేసేందుకు పకడ్బంది ప్రణాళిక రచించినట్లు తెలిసింది. ఆగస్టు 24న నిజామాబాద్ కలెక్టర్ అధికార లేఖను అనుసరించి 2261/సిఎస్-ఐ-సిసిఎస్/2026 అనే మెమో తో ఖరీఫ్ 2025-26లో క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేసిన ధాన్యంను కామన్ కేటగిరిగా మార్చడంతో నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన అనేక మంది రైసుమిల్లర్లు సన్నధాన్యం బాయిల్డ్ రైస్‌గా మార్పుచేయకుండా ఆ ధాన్యంను బయట అమ్ముకొని పొరుగు రాష్ట్రాల నుంచి నాసిరకం బియ్యం తీసుకొచ్చి ఎఫ్‌సిఐ కి అప్పగించారు. ఎఫ్‌సిఐ సిఎంఆర్ బియ్యం అనుమతి ఇచ్చే ముందు వాటి నాణ్యత గుర్తించేందుకు ఎఫ్‌సిఐ పౌరసరఫరాలశాఖ అధికారులు 12 రకాల పరీక్షలు చేయడం రివాజు. ఆ పరీక్షల ఫలితాలపై అధికారుల బాధ్యతారాహిత్య పర్యవేక్షణ వెనుక ఉన్న ఆర్థిక అక్రమసంబంధాలపై కూడా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ సిఎంఆర్ కార్యకలాపాలు సజావుగా సాగించేందుకు చేసిన చేసిన సూచనల ప్రకారం సన్నబియ్యం కామన్ వెరైటీగా ప్రకటించడంతో ఆ జిల్లాలో ఆరు రైసుమిల్లు నుంచి సెప్టెంబర్ చివరి నాటికి సన్నాలకు బదులు ఇతరరాష్ట్రాల నుంచి చౌకగా కొనుగోలు చేసి పాలీష్ చేసి అందించినట్లు సివిల్‌సప్లయ్ ఎక్స్ అఫియో ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర గుర్తించి వెంటనే మెమోను కూడా రద్దుచేశారు.

నిజామాబాద్ జిల్లాలో గత పది సంవత్సరాలుగా 65 మంది రైసు మిల్లర్ల నుంచి 508కోట్ల రూపాయల మేరకు బియ్యం రావాల్సి ఉంది. విజిలెన్స్ దాడులతో పిడి చట్టాలతో రెవెన్యూ రికవరీ అస్త్రాలతో ప్రత్యక్ష చర్యలకు దిగడంతో ఇప్పటి వరకు 115కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా 393కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. వరంగల్ జిల్లాలో కూడా ఇప్పటి వరకు సన్నాలను పక్కదారిపట్టించిన 13 మిల్లులపై కూడా క్రిమినల్ కేసులు పెట్టారు. బియ్యం బకాయిదారులకు నోటిసులు అందజేసిన వారం రోజుల్లోనే రెవెన్యూ రికవరి చట్టం ప్రయోగించి ఆస్తులు జప్తు చేసే ప్రక్రియ మొదలు పెట్టేందుకు ఆరంభంగా ఆదివారం అరెస్టులతో శ్రీకారం చుట్టింది.


అక్రమదందా చేసే మిల్లరపై నిరంతరం పర్యవేక్షణ ఉండేందుకు కొత్తగా సాఫ్టవేర్‌ను మొబైల్ యాప్‌ను ఒపిఎంఎస్ పోర్టల్‌ను అభివృద్ధిచేశారు. ప్రతి బుధవారం మిల్లులను తనిఖీ చేయనున్నారు. కరీంనగర్ జిల్లాలో 34 మిల్లర్లకు ఇక ముందు సిఎంఆర్ ధాన్యం కెటాయింపు చేయకుండా ఆంక్షలు విధించారు. నలుగురు రైస్‌మిల్లర్లు సన్నాలకు బదులు దొడ్డు రకం ఇవ్వడంతో వారిని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా సివిల్‌సప్లయ్, ఎఫ్‌సిఐ అధికారులు పాత్రపై కూడా వారు నోరు మెదిపినట్లు తెలుస్తోంది.

## ఓటరు నమోదు మొత్తానికీ ఇసి ఆధ్వర్యంలోనే జరగాలి

### ఎన్నికల కమిషన్ సిఇఓ సుదర్శన్‌రెడ్డిని కలిసిన మాజీమంత్రి తలసాని

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఎన్నికల కమిషన్ అధికారులే ఓటరుగా నమోదు చేయించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో జాప్యం, ఎన్నికల కమిషన్ బాధ్యతలను విస్మరించడం తదితర అంశాలపై తలసాని ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం బిఆర్కె భవన్‌లో సోమవారం ఎన్నికల కమిషన్ సీఈవో సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణి దేవి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమం మొత్తానికీ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాలని స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమానికి నవంబర్ 6 తో గడువు ముగియనున్న ఇప్పటి వరకు బీఎల్‌వోలను నియమించలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి



సిఇఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

చర్యలు చేపట్టలేదని వివరించారు. ఓటరుగా నమోదు చేసుకోవాలనే విషయంలో ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడం వారి బాధ్యత రాహిత్యాన్ని స్పష్టం చేస్తుందని చెప్పారు.

గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో ఓటు వేసిన వారు కూడా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవడం ఏమిటన్న ప్రశ్నకు ఎన్నికల కమిషన్ అధికారుల వద్ద సమాధానం లేదని ఆరోపించారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో హైదరాబాద్ నగర పరిధిలో ఒక లక్ష 10 వేల మంది ఓటర్లు నమోదు కాగా, ప్రస్తుతం ఇప్పటి వరకు 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని ఎన్నికల కమిషన్ అధికారులు తెలపడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో 5.27 లక్షల దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల కమిషన్ అధికారులు ప్రకటించారు తప్ప, వాటి వెరిఫికేషన్ ప్రారంభించలేదని అన్నారు.

గ్రాడ్యుయేట్‌లు ఈ దేశ పౌరులు కాదన్నట్లుగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను విస్మరించడంతో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కష్టపడి గ్రాడ్యుయేట్‌ల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని అందజేసేందుకు అధికారుల వద్దకు వెళితే దరఖాస్తుదారులే రావాలని, బల్క్‌లో దరఖాస్తులు తీసుకోమని అభ్యంతరాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు కోలేటి దామోదర్ గుప్త, మన్నె క్రిశాంక్, గజ్జల నగేష్ ఉన్నారు.

## ఎఇఇ, ఎస్‌ఎస్‌సి, జెఇ, ఎగ్జామ్స్ డేట్ క్లాష్

### తేదీల మార్పుపై అభ్యర్థుల వినతికి టిజిపిఎస్సీ ఓకె

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల తేదీలు, అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షల తేదీలు ఒకే రోజు రావడంతో అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. నవంబర్ 6,7 తేదీల్లో జరగాల్సిన టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్ష తేదీలు, నవంబర్ 2 నుంచి 6 వరకు షెడ్యూల్ చేయబడిన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీలతో క్లాష్ అవుతున్నట్లు అభ్యర్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎస్సెస్సీ చైర్మన్‌తో స్వయంగా మాట్లాడి అభ్యర్థుల ఇబ్బందిని పరిష్కరించేందుకు చొరవ చూపారు. ఈ పరీక్షల క్లాష్‌ను పరిష్కరించే క్రమంలో, ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీ నవంబర్ 6, 2026గా కేటాయించబడి, టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష కూడా అదే రోజు రావడం వల్ల నష్టపోతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. నవంబర్ 6వ తేదీన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ (సివిల్) పరీక్షను కలిగి ఉండి, టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొన్ని నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఎస్సెస్సీ జెఈ హాల్ టికెట్ కాపీ (నవంబర్ 6 తేది ఉన్నది), టీజీపీఎస్సీ ఏఈ నోటిఫికేషన్ అప్లికేషన్ కాపీ, టీజీపీఎస్సీ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటిఆర్) ఐడీలను సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఈ పత్రాలను ఈనెల 30 సాయంత్రం 5 గంటలలోపు టీజీపీఎస్సీ ఆఫీస్‌లోని హెల్ప్ డెస్క్ ద్వారా లేదా మెయిల్ ఐడీకి పంపాలని సూచించారు. అభ్యర్థులు ఏ ఒక్కరు కూడా మంచి అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో పరిశీలన తర్వాత సాధ్యమైనంత వరకు నవంబర్ 7, 2026న టీజీపీఎస్సీ ఏఈ పరీక్షను రాయడానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు కమిషన్ అధికారికంగా వెల్లడించింది. అభ్యర్థులు గడువులోగా తమ డాక్యుమెంట్లను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తుమ్మిడిహెట్టిపై అధ్యయన కమిటీకి రెండు రాష్ట్రాలు అంగీకారం

### పెద్ద హృదయంతో పరిశీలించిన మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్‌కు కృతజ్ఞతలు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై మహారాష్ట్ర ఫడ్నవీస్‌తో చర్చల సారాంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. 'ఫడ్నవీస్‌తో చర్చలు ఫలవంతంగా సాగాయి. మా ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించిన సిఎంకు కృతజ్ఞతలు సాంకేతిక, ముంపు అంశాలపై అధికారులతో అధ్యయనానికి కమిటీ వేసేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రజల జీవితా మార్పునకు సహకరిస్తానని హామీ ఇచ్చారు' అని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కాగా, సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఇద్దరు సిఎంల సమావేశంలో 'తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరి అనుసరించిందని ఫడ్నవీస్ గుర్తుచేశారు' అని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యారేజీ ఎత్తు పెంపుపై తెలంగాణ చేసిన అభ్యర్థనను పరిశీలించేందుకు స్వతంత్రంగా అధ్యయనం చేపట్టాలని మహారాష్ట్ర నిర్ణయించింది. బ్యారేజీ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణాన్ని ఈ అధ్యయనంలో పరిశీలించనున్నారు. మహారాష్ట్ర అధ్యయనంలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి పరిశీలిస్తారని ఫడ్నవీస్ తెలిపారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామన్నారు. వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రైవేట్ జూనియర్ కళాశాలపై రూ.5.44 కోట్ల జరిమానా రద్దు చేయాలి


### ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీసతీష్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రైవేట్ జూనియర్ కళాశాలపై ఇంటర్మీడియట్ బోర్డు విధించిన రూ.5.44 కోట్ల జరిమానాలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీ సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం సమావేశం జరిగింది. గౌరీ సతీష్ మాట్లాడుతూ అర్హత ఉన్న కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న అనుబంధ గుర్తింపులను వెంటనే మంజూరు చేయాలని, బోర్డు ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి 544 ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఒక్కొక్కదాని రూ.లక్ష చొప్పున రూ.5.44 కోట్ల జరిమానా విధించడం అన్యాయమని అన్నారు. ఏవైనా లోపాలు ఉంటే ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, యాజమాన్యాల వివరణ తీసుకున్న తర్వాతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నకిలీ ధ్రువపత్రాల సమర్పణకు సంబంధించి 79 కళాశాలలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

## రక్షణ దళాలకు రూ.2.12 లక్షల కోట్ల కొనుగోళ్లకు ఆమోదం

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, లాంగ్‌రేంజ్ కామికాజ్ డ్రోన్లు సహా సైనిక ప్లాట్‌ఫామ్‌లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్‌కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్‌ప్రొపెల్డ్ ట్రాక్డ్‌గన్ సిస్టమ్,, గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్, తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, వెరీ షార్ట్‌రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (అతి తక్కువ దూరంలోని వైమానిక దాడులను అడ్డుకొనే వ్యవస్థ , కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (డ్రోన్ నిరోధక వ్యవస్థ ) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర డ్రోన్‌వ్యవస్థలు, మానవ రహిత నిఘా వైమానిక వ్యవస్థలు, సమన్వయ, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు , దీర్ఘశ్రేణి కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. ఆర్మీ కోసం కొనుగోలు చేసే ఈ హై మొబిలిటీ వాహనాలు కఠినమైన భౌగోళిక ప్రాంతాల్లో మన సైన్యం కార్యాచరణ సామర్థ్యాలను, రవాణా సౌకర్యాలను, కదలికలను మరింత మెరుగుపరుస్తాయి. సెల్ఫ్‌ప్రొపెల్డ్ ట్రాక్డ్ గన్ సిస్టమ్ మన సైనికులు వేగంగా కదులుతూ, కాల్పులు జరపడానికి వీలుకల్పిస్తుంది. గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్) అనేది యుద్ధరంగంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, సైన్యానికి ఒక అదనపు బలగంగా ఉపయోగపడుతుంది. ఇక లైట్ మల్టీరోల్ హెలికాప్టర్లు భారత ఆర్మీ, వైమానిక దళం రెండూ ఉపయోగించనున్నాయి. వీటిని నిఘా, శోధన,



సైనిక రెస్క్యూ ఆపరేషన్లు, మానవతాసాయం, విపత్తు సహాయక చర్యలు వంటి బహుళ ప్రయోజనాలకు వినియోగిస్తారు. ఆధునిక చిన్న విమానాల నుంచి ఎదురయ్యే దాడులను తిప్పికొట్టేందుకు ఉపయోగపడుతుంది. ఆధునిక యుద్ధరంగంలో ట్యాంకుల మనుగడ సామర్థ్యాన్ని వ్యవస్థ పెంచుతుంది. ఈ నిఘా, డ్రోన్ వ్యవస్థలు భారత సైన్యం సామర్థ్యాలను మరింత పటిష్టం చేస్తాయని రక్షణమంత్రిత్వ శాఖ చెబుతోంది. మరోవైపు భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్ బోర్డ్ డెకాయ్ సిస్టమ్, ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. ఏవోడిఎస్ వ్యవస్థ శత్రువుల ఆధునిక నౌకా విధ్వంసక క్షిపణుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఇది క్షిపణి నిరోధక వ్యవస్థల విశ్వసనీయతను మరింత పెంచుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేసి, నిర్మించనున్న ఈ ప్రధాన నౌకా ప్లాట్‌ఫారమ్‌లు ఆధునిక యుద్ధ సామర్థ్యాలను కలిగి ఉండి, మన నౌకాదళం పోరాటశక్తిని పెంచుతుందని భావిస్తున్నారు. భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్ బ్యాండ్ డాప్లర్ వెదర్ రాడార్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కోసం కొనుగోలు చేసే ఈ స్పెషల్ హెలికాప్టర్లు ముఖ్యమైన వైమానిక రవాణా అవసరాలను తీర్చడానికి సహాయపడుతుంది. అలాగే ఎక్స్ బ్యాండ్ డాప్లర్ వెదర్ రాడార్ సిస్టమ్ సరిహద్దు, వ్యూహాత్మక ప్రాంతాలలో అత్యంత కచ్చితమైన, స్థానిక వాతావరణ సమాచారాన్ని అందిస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, మొత్తం మంజూరు చేసిన వాటిలో దాదాపు 82 శాతం రక్షణ కొనుగోళ్లను భారతీయ పరిశ్రమల నుంచే చేపట్టనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.





ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న పాలడుగు భాస్కర్

## కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేసేదాకా పోరు

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ స్పష్టం చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కొత్తగా తెచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు 42వేలుగా నిర్ణయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, డిఏలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటియూ ఆధ్వర్యంలో చేపట్టిన మల్టిపుల్ డేస్ మహాధర్నా రెండవరోజు కొనసాగించారు. ఈ ధర్నా నుద్దేసించి సిఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ సీఐటియూ కార్మికుల పక్షాన పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయకపోతే గద్దె దించటం ఖాయమని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు తగ్గించి, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను తీసుకువచ్చి, కార్మిక శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం డిసెంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఢిల్లీ రాంలీలా మైదానంలో దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాధర్నాలో సీఐటియూ నేతలు వంగూరి రాములు, టి.సాగర్, మల్లు లక్ష్మి, రమ, ఆర్.వెంకట్రాములు, బి.బసవపున్నయ్య, కే.పార్థసారథి, జే.వెంకటేష్, మల్లిఖార్జున్, పద్మజ, ధనలక్ష్మి, కల్లూరి మల్లేశం, జే.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా నీటి కోతతో బీర్లకు కొరత

**హైదరాబాద్,అక్టోబరు26,ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో మంజీరా నీటికి కొరత ఏర్పడింది. దీంతో స్థానికంగా బీరు కంపెనీలపై ప్రభావం పడింది. మంజీరా నీటి సరఫరాలో కోత విధించే పరిస్థితి ఉండటంతో సంగారెడ్డి, పరిసర ప్రాంతాల్లోని బ్రూవరీ కంపెనీలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతం బీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందని బేవరేజెస్ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో ఫార్మాస్యూటికల్, ఇతర పరిశ్రమలు కూడా ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నాయి. సంగారెడ్డి పట్టణ పరిసరాల్లోని బీరు కంపెనీలకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు మంజీరా నీటి సరఫరాను దాదాపుగా నిలిపివేసినట్లు తెలిసింది. దీంతో ఆయా కంపెనీలు బీర్ల తయారీకి భూగర్భ జలాలపై ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా తెలంగాణలో ఇకపై విక్రయించే బీర్ల రుచి మారే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మంజీరా నీరు బీరుకు రుచిని ఇస్తుంది.

అందువల్ల తెలంగాణలోని ప్రధాన బ్రూవరీలు సంగారెడ్డి పట్టణం, పరిసర ప్రాంతాల్లో తమ బీర్ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. బీర్ల తయారీకి ఏడాది పొడవునా సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని వాడుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీరు కంపెనీలకే కాదు.. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీరందించే సింగూర్ ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండటంతో తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. సంగారెడ్డి జిల్లాలో మంజీరా నదిపై నిర్మించిన సింగూర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.341 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గతేడాది మంజీరా నది పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, ఎగువన కర్ణాటక నుంచి వచ్చిన వరదలతో సింగూర్ ప్రాజెక్టులోకి 20 టీఎంసీలకు పైగా నీరు చేరింది. అయితే ప్రాజెక్టు డ్యామ్‌లో భద్రతా లోపాలు, అప్‌స్ట్రీమ్ స్లోప్ రివెట్‌మెంట్ దెబ్బతినడంతో మరమ్మతులు చేపట్టాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించింది. దీంతో సింగూర్ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించిన అధికారులు, పనులకు ఆటంకం ఏర్పడకుండా నిల్వ ఉన్న నీటిని దిగువకు వదిలారు. దీంతో సింగూర్‌లో నీటి నిల్వ కనిష్ట స్థాయికి చేరుకుంది.

ఆట

### వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# 'కాంస్య' పోరులో లలిత్ ఓటమి



**అస్తానా:** కజకిస్తాన్‌లోని అస్తానాలో జరిగిన కాంస్య పతకం పోరులో లలిత్ ఓడిపోవడంతో, భారతదేశానికి అరుదైన గ్రీకోరోమన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని గెలుచుకునే అవకాశాన్ని కోల్పోయాడు. అదే సమయంలో అతని తోటి క్రీడాకారులలో ముగ్గురు తొలి అడుగు వద్దే విఫలమై టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. కాంస్య పతకం కోసం సోమవారం జరిగిన పోరులో కజకిస్తాన్‌కు చెందిన ఇస్టార్ కుర్బాయేవ్‌తో తలపడిన లలిత్, టెక్నికల్ సుపీరియారిటీతో ఓడిపోయాడు. కుర్బాయేవ్ నాలుగు పాయింట్లు సాధించి, ఆ తర్వాత లిఫ్ట్ చేసి క్షణాల్లో పోరును ముగించాడు. ఉదయం సెషన్‌లో అమెరికన్ మాక్స్ ఎమిలియానో నొరీపై తన రెపెచేజ్ రౌండ్‌లో 7-0 తేడాతో గెలిచిన తర్వాత లలిత్ మెడల్ రౌండ్‌కు చేరుకున్నాడు. 2013లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ఏకైక భారత గ్రీకో రోమన్ రెజ్లర్ సందీప్ తులసి యాదవ్. ఆసియా క్రీడల రజత పతక విజేత నితేష్ శివాచ్‌తో సహా, తమ తొలి బౌట్‌లలో ముందుకు సాగడంలో విఫలమైన మిగతా ముగ్గురు భారత రెజ్లర్లకు కూడా ఇది నిరాశాజనకమైన రోజు. 97 కేజీల విభాగంలో పోటీపడిన సివాచ్, జర్మనీకి చెందిన ఆంటోన్ వ్యూవెగ్ చేతిలో పూర్తిగా ఓడిపోయాడు. వ్యూవెగ్ ప్రతి పీరియడ్‌లోనూ నాలుగు పాయింట్ల త్రోను ప్రదర్శించి, టెక్నికల్ సుపీరియారిటీతో పోటీని ముగించాడు. కరణ్‌జిత్ (72 కేజీలు) తన క్వాలిఫికేషన్ బౌట్‌లో జపాన్‌కు చెందిన రింటారో సోగాబే చేతిలో 23 తేడాతో స్వల్ప ఓటమిని చవిచూశాడు.

# ఫిఫా ప్రపంచ కప్: గ్రెనడాతో భారత్ డ్రా



**బాకు:** తొలి ఫిఫా అండర్15 ప్రపంచ కప్ ఫెస్టివల్ అజర్‌బైజాన్ 2026లో భారత్ తన అజేయ పరంపరను కొనసాగించింది. భారత్ ఆట ప్రారంభమైన వెంటనే గ్రెనడాను అర్ధభాగంలోనే కట్టడి చేసింది. నిబాస్ మీటీ వాహెంగ్‌బామ్ పంపిన బాల్‌ను అందుకున్న మాక్‌డొనిష్ గైరాంగ్‌బామ్ గోల్ చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత భారత జట్టు మొదటి అర్ధభాగం మిగిలిన భాగమంతా అదే జోరును కొనసాగిస్తూ, నిర్విరామంగా అవకాశాలను సృష్టిస్తూనే ఉంది. 22వ నిమిషంలో లాల్‌మింగ్‌పుయా ద్వారా బిబియానో ఫెర్నాండెజ్ జట్టు తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. సౌమోజిత్ సర్కార్ పంపిన లాంగ్ బాల్ గ్రెనడా డిఫెండర్ ఒమారి మెక్‌స్వీన్‌కు తగిలి వెనక్కి రాగా లాల్‌మింగ్‌పుయా శక్తివంతమైన షాట్ కొట్టి స్కోరును 2-0కి చేర్చాడు. ఏడు నిమిషాల తర్వాత, రొనాండేవ్ అహీబామ్ బంతిని గోల్‌లోకి నెట్టి, ఆధిక్యాన్ని 3-0కి పెంచడం ద్వారా బ్లూ కోల్ట్స్ మళ్లీ గోల్ చేసింది. కానీ మ్యాచ్ ముగిసిపోయిందనుకున్న తరుణంలో, జయవర్ధి నోయెల్‌న కై విల్సన్ గోల్స్ చేయడంతో 33వ నిమిషానికి కరేబియన్ జట్టు స్కోరును 3-2కి మార్చింది. 37వ నిమిషంలో ఫ్రీకిక్‌ను నోయెల్ గోల్‌గా మలచడంతో గ్రెనడా స్కోరును సమం చేసింది. గ్రూప్ కెలో ఏకకాలంలో జరిగిన ఇతర మ్యాచ్‌లలో, కామెరూన్ మరియు సెనెగల్ జట్లు వరుసగా లావోస్ మరియు బ్రెజిల్‌పై 6-1 తేడాతో విజయాలు సాధించాయి. అయినప్పటికీ, బ్లూ కోల్ట్స్ ఏడు పాయింట్లతో గ్రూప్‌లో అజేయంగా నిలిచిన ఏకైక జట్టుగా ఉంది.

**టోక్యో:** సోమవారం జరిగిన టోరే పాన్ పసిఫిక్ ఓపెన్‌లో, ఎనిమిదో సీడ్ అలెగ్జాండ్రా ఈలా కేవలం 75 నిమిషాల్లోనే 17 ఏళ్ల వైల్డ్ కార్డ్ క్రీడాకారిణి మికా స్టోజ్‌సావ్లెవిక్‌పై 6-1, 6-2 తేడాతో తిరుగులేని విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఇదిలా ఉండగా, రెండో సీడ్ మాయా చ్వాలిన్స్కా, డిఫెండింగ్ ఛాంపియన్ బెలిండా బెన్సిచ్ గాయాల కారణంగా టోర్నమెంట్ నుండి వైదొలిగారు. స్టోజ్సావ్లెవిక్ బేస్‌లైన్ నుండి తన శక్తిని ప్రదర్శిస్తూ, ఈలా యొక్క ఎనిమిది విన్నర్‌లతో పోలిస్తే 24 విన్నర్‌లను కొట్టింది. అయితే ఆ టీనేజర్ స్థిరత్వాన్ని కొనసాగించడంలో ఇబ్బంది పడి 41 అనవసర తప్పిదాలు చేసి నష్టపోయింది. ఈలా తన మొదటి సర్వ్‌లలో 68 శాతం విజయవంతంగా వేసి, వాటి ద్వారా వచ్చిన పాయింట్లలో 72 శాతం గెలుచుకుంది. ఆమె కేవలం ఒకే గేమ్‌లో రెండవ సెట్‌లోని రెండవ గేమ్‌లో బ్రేక్ పాయింట్లను ఎదుర్కొని, రెండు సర్వీస్ విన్నర్‌లు మరియు సమర్థవంతమైన వన్ టూ కాంబినేషన్‌తో 0-40 లోటు నుండి కోలుకుని విజయం సాధించింది.

## పసిఫిక్ ఓపెన్ రెండో రౌండ్‌లోకి ఈలా





# నేడు న్యూజిలాండ్‌తో భారత్ కీలక మ్యాచ్

### వైభవ్ సూర్య, భువీ ఔట్?.. ఇషాన్ రీఎంట్రీ, మయాంక్‌కు ఛాన్స్!

**వెల్లింగ్టన్ (న్యూజిలాండ్):** న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా టీమిండియా వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి 2-0 ఆధిక్యంలో నిలిచింది. సిరీస్‌ను 3-0తో గెలుచుకోవడమే లక్ష్యంగా ఈ నెల 27 వెల్లింగ్టన్ వేదికగా జరగనున్న మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఢీ కొట్టేందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా సిద్ధమవుతోంది. అయితే ఈ మూడో టీ20 మ్యాచ్ కోసం తుది జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు ఈ సిరీస్ తీవ్ర నిరాశను మిగిల్చింది. అంతర్జాతీయ టీ20ల్లో 90 మ్యాచ్‌లు ఆడి 91 వికెట్లు తీసిన భువీ ఈ సిరీస్ లోని మొదటి రెండు మ్యాచ్‌ల్లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. మొదటి మ్యాచ్‌లో 49 పరుగులు ఇవ్వగా, రెండో టీ20లో 4 ఓవర్లలో 50 పరుగులు ఇచ్చి కేవలం ఒకే ఒక్క వికెట్ పడగొట్టాడు. వరుసగా విఫలమవుతున్న భువనేశ్వర్‌కు విశ్రాంతి ఇవ్వాలని సెలక్టర్లు యోచిస్తున్నట్లు సమాచారం. భువీ స్థానంలో స్టార్ పేసర్ మయాంక్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. తొలి మ్యాచ్ మయాంక్ 40 పరుగులకు ఒక వికెట్ తీసినప్పటికీ, రెండో మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ ఏడాది టీ20ల్లో భారత్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచిన కిషన్ రాకతో భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు మరింత బలం చేకూరనుంది. కాగా రెండో టీ20లో ఇషాన్ ప్లేస్‌లో వచ్చి మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన వైభవ్ సూర్యవంశీ తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 8 బంతుల్లో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. దీంతో వైభవ్ తిరిగి బెంచ్‌కే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక జట్టులోని సంజు శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ తుది జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకోవడం దాదాపు ఖాయం. ఇక ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ లేదా వరుణ్ చక్రవర్తిని పరిశీలించే అవకాశం ఉన్నప్పటికీ వెల్లింగ్టన్ పిచ్ స్వభావాన్ని బట్టి మ్యాచ్ ప్రారంభానికి ముందు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

### న్యూజిలాండ్‌పై 284 పరుగులతో

# భారత్ ఆధిక్యం

**లింకన్:** న్యూజిలాండ్ ఎ తో జరిగిన తొలి అనధికారిక టెస్టులో, అద్భుతమైన 199 పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ ద్విశతకాన్ని తృటిలో కోల్పోగా, భారత్ ఎ జట్టు అద్భుతంగా పుంజుకుని పట్టు సాధించింది. లింకన్‌లో మూడవ రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి, న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 317 పరుగులు చేయగా, ఇండియా 488/8 స్కోరు సాధించి, తమ మొత్తం ఆధిక్యాన్ని 284 పరుగులకు పెంచుకుంది. తమ తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే ఆలౌట్ అయిన అతిథి జట్టుకు రెండు వికెట్లు మిగిలి ఉన్నాయి. 56 పరుగుల వద్ద ఆటను తిరిగి ప్రారంభించిన పడిక్కల్, విలువైన 91 పరుగులు చేసిన సాయి సుదర్శన్‌తో కలిసి ఓవర్‌నైట్‌లో తాను సాధించిన పురోగతిని కొనసాగించాడు. పడిక్కల్, జేడెన్ లెనాక్స్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టి తన 12వ ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. యశ్ రాథోడ్ పడిక్కల్‌తో జతకలిసి ఎదురుదాడికి దిగి, క్రిస్టియన్ క్లార్క్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు, ఒక సిక్సర్ బాదాడు. రాథోడ్ 54 బంతుల్లో తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని అవుటయ్యే ముందు చివరకు 66 పరుగులు చేశాడు. అన్షుల్ కంబోజ్ 22 పరుగులు చేయగా, వాషింగ్టన్ సుందర్, అకిబ్ నబీ 69 పరుగులు జోడించారు. నబీ 38 పరుగులు చేసి అవుటయ్యాడు, కాగా సుందర్ 51 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వెలుతురు మసకబారడంతో రోజు ఆట ముందుగానే ముగిసింది.



# భారత్ రూపాయిపై పెరుగుతున్న ఒత్తిడి



**ముంబయి,అక్టోబరు 26:** డాలర్‌తో పోలిస్తే ఇటీవల కోలుకున్న భారత రూపాయికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ చర్యలు తీసుకున్నా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడుల రాకపై అనిశ్చితి కొరెన్సీ పై ఒత్తిడి పెంచుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఒకు సంబంధించిన విదేశీ నిధుల రాకతో గతవారం రూపాయికి కొంత మద్దతు లభించింది. అయితే ఆ ఊతం త్వరలో తగ్గిపోవ చ్చన్న అంచనాలు ఆందోళనకలిగిస్తున్నాయి. సోమ వారం ట్రేడింగ్ ప్రారంభంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.94.93గా నమోదైంది. శుక్రవారం ముగింపు రూ.94.94తో పోలిస్తే ఇది స్వల్పంగా బలపడినట్లే. ఆ తర్వాత రూపాయిపై మళ్లీ ఒత్తిడి పెరిగింది. సోమవారం ఉదయం 11.10 గంటల సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.95.115కు పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూ.95 స్థాయిని దాటకుండా నిలదొక్కుకోవడం కీలకంగా మారింది. రూపాయి రికవరీకి ప్రధాన అడ్డంకిగా ముడిచమురు ధరలు మారాయి. బ్రెంట్ క్రూడ్ ధర గతవారం ఆరు శాతానికిపైగా పెరిగి బ్యారెల్‌కు దాదాపు 115 డాలర్ల స్థాయికి చేరింది. సౌదీ అరేబియాపై దాడుల నేపథ్యంలో చమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. ధరలు పెరిగితే దిగుమతుల బిల్లు పెరిగి, దేశ వాణిజ్య లోటుపై ఒత్తిడి పడుతుంది. ఇది రూపాయి విలువను మరింత బలహీనపరచ వచ్చు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఒకు విదేశీ సంస్థా గత పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ పెట్టుబడులకు సంబంధించిన డాలర్ల ప్రవాహం రూపాయికి ఊతమిచ్చింది. అయితే ఐపిఒ షేర్ల కేటాయింపు ప్రక్రియ సోమవారంతో ముగియనుండటం, బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ జరగనుండటంతో ఈ మద్దతు తగ్గవచ్చని ట్రేడర్లు భావిస్తున్నారు. మరోవైపు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం కూడా రూపా యిపై ప్రభావం చూపుతోంది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బిఐ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది.

# 13 వారాల తర్వాత గోల్డ్ ఇటిఎఫ్‌లలో నష్టాలు

### నాలుగు శాతం పడిపోయిన పసిడి ధరలు..
### అమెరికా ఇన్వెస్టర్ల భారీ విక్రయాలు

వాణిజ్యం



**ముంబయి, అక్టోబరు 26:** బంగారంతో మద్దతు ఉన్న గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్‌లు) నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లడం ప్రారంభ మైంది. వరుసగా 13 వారాల పాటు నికర పెట్టు బడులు నమోదైన తర్వాత, గత వారంలో ఇటి ఎఫ్‌ల నుంచి పెట్టుబడులు నికరంగా తగ్గాయి. ఇదే సమయంలో పసిడిధరలు దాదాపు నాలుగు శాతం పడిపోయాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గత వారంలో గోల్డ్ ఇటిఎఫ్‌ల నుంచి 301 కోట్ల డాలర్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకోగా, కొత్తగా వచ్చిన పెట్టుబడులు 180 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ముఖ్యంగా అమెరికా ఇన్వెస్టర్లు పెద్దఎత్తున విక్రయాలకు దిగారు. బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల దిగువకు పడిపోవడంతో వారు గత వారంలో 170 కోట్ల డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకు న్నారు. జూన్ తర్వాత బంగారం ధరలకు గత వారం అత్యంత ప్రతికూలంగా మారిందని ఆగ్‌మాంట్ చీఫ్ రీసెర్చ్ ఆఫీసర్ రెనిషా చైనాని తెలిపారు. చమురు ధరలు, కరెన్సీ మార్పిడి రేట్లు, బలవంతపు విక్రయాలు పసిడి ధరల పతనానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. బలపడుతున్న డాలర్, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, ద్రవ్యో ల్బణంపై ఆందోళనలు బంగారం ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయని ఆస్పెక్ట్ బులియన్ అండ్ రిఫైనరీ సిఇఒ దర్శన్ దేశాయ్ అన్నారు. సమీప భవిష్యత్తులో బంగారం ధరల దిశను నిర్ణయించడంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం కీలకంగా మారనుందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయానికి బంగారం ధర ఔన్సుకు 3,995 డాలర్లకు పడిపోయింది. దీంతో అదే రోజు అంతకుముందు నమోదైన లాభాలు ఆవిరయ్యాయి. బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల స్థాయిలో నిలదొక్కుకునేందుకు ప్రయత్ని స్తోందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ అనలిస్ట్ మనవ్ మోడీ తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి, కేంద్ర బ్యాంకుల నుంచి కొనసాగుతున్న డిమాండ్, ప్రభుత్వ ఆర్థిక పరిస్థి తులపై ఆందోళనలు, అమెరికా ట్రెజరీ బాండ్ ఈల్డ్‌లో కొంత తగ్గుదల పసిడికి మద్దతునిస్తున్నా యని వివరించారు.

గత వారంలో అమెరికాతో పాటు మరికొన్ని దేశాల ఇన్వెస్టర్లు కూడా గోల్డ్ ఈటిఎఫ్‌ల నుంచి పెట్టు బడులను వెనక్కి తీసుకున్నారు. మరోవైపు, గోల్డ్ ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడులరాకలో బ్రిటన్ ముందంజలో నిలిచింది. ఆ దేశంలోకి 32.18 కోట్ల డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. స్విట్జర్లాండ్‌లో 6.43 కోట్ల డాలర్లు, జర్మనీలో 4.58 కోట్ల డాలర్లు, చైనాలో 2.14 కోట్ల డాలర్ల పెట్టుబడులు నమోదయ్యాయి. ఈ యేడాది ఇప్పటివరకు చూస్తే, చైనా ఇన్వెస్టర్లు అత్యధికంగా 1,043 కోట్ల డాలర్లను గోల్డ్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడి పెట్టారు. బ్రిటన్ 1,022 కోట్ల డాలర్ల పెట్టుబడులతో రెండో స్థానంలో నిలిచింది. భారత్ 469 కోట్ల డాలర్ల పెట్టుబడులతో మూడో స్థానంలో ఉంది. స్విట్జర్లాండ్‌లో 363 కోట్ల డాలర్లు, అమెరికాలో 351 కోట్ల డాలర్లు, జర్మనీలో 247 కోట్ల డాలర్లు, ఫ్రాన్స్‌లో 179 కోట్ల డాలర్లు, జపాన్‌లో 106 కోట్ల డాలర్లు, హాంకాంగ్ ప్రత్యేక పరిపాలనా ప్రాంతంలో 101 కోట్ల డాలర్ల పెట్టుబడులు నమోదయ్యాయి. కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు, భారత గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వస్తున్న పెట్టుబడులు పసిడి ధరలకు మద్దతునిస్తున్నాయని రిద్ధిసిద్ధి బులియన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పృథ్వీ రాజ్ కొఠారి తెలిపారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబయి, అక్టోబర్ 26:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగు సెషన్ల నష్టాలకు బ్రేక్ వేస్తూ సోమవారం లాభాల్లో ముగిశాయి. భారీగా పడి పోయిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, ముడి చమురు ధరలు తగ్గడం, అంతర్జా తీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 117 డాలర్ల సమీపంలోని దాదాపు ఆరు నెలల గరిష్ఠ స్థాయి నుంచి 114.50 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) వారాంతంలో రూ.887.65 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మెటల్స్, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసిజి షేర్లు నష్టాలను చవిచూశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 482.92 పాయింటు పెరిగి 73,606.75 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 153.20 పాయింట్లు లాభపడి 22,753.20 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3.49 శాతం, నిఫ్టీ 2.36 శాతం చొప్పున పడిపోయాయి. నిఫ్టీని ముందుకు నడిపిన షేర్లలో కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.38 శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.34 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.99 శాతం చొప్పున లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 1.07 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 సూచీ 1.13 శాతంఎగబాకింది. సోమ వారం మార్కెట్ విస్తృతి సానుకూలంగా నమో దైంది. బిఎస్ఇలో మొత్తం 2,420 షేర్లు లాభాల్లో ముగియగా, 2,005 షేర్లు నష్టపోయాయి. మరో 262 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ డిసెంబర్ 2026 సెటిల్‌మెంట్ ఫ్యూచర్స్ ధర 1.56 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 115.16 డాలర్లకు చేరింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ల రాబడి గత సెషన్‌లోని 7.473 శాతం నుంచి 7.493 శాతా నికి పెరిగింది. విదేశీ మారక మార్కెట్‌లో అమె రికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలప డింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 94.9300 వద్ద ముగిసిన రూపాయి, సోమవారం 94.2100 స్థాయిలో ట్రేడయింది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 సెటిల్‌మెంట్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.62 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,42,899కు చేరింది. లాభపడిన ముఖ్యమైన షేర్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.38 శాతం పెరిగింది. ఇన్ఫోసిస్ 1.06 శాతం లాభపడింది.

# ద్రవ్యలోటు తగ్గింపునకు కేంద్రం కట్టుబడి ఉంది

### ధరల స్థిరీకరణకు నిరంతర చర్యలు
### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** దేశంలో ద్రవ్యలోటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టు బడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. ప్రతి యేడాది ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్లలో ఈ నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. 2030 నాటికి దేశ జాతీయ రుణాన్ని స్థూల దేశీయోత్పత్తి లో 50 శాతానికి పరిమితం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కరోనా మహమ్మారి అనంతర కాలం నుంచి ప్రపంచంలోని అన్ని దేశాలు రుణభారానికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఆమెతెలిపారు. కేంద్ర ప్రభుత్వ రుణభారాన్ని తగ్గించేం దుకు నిరంతరం చర్యలు చేపడుతున్నామని, రుణ నిర్వహణలో భారత్ అనుసరిస్తున్న క్రమశిక్షణతో కూడిన విధానాన్ని అంతర్జాతీయ సంస్థలు సైతం గుర్తించాయని చెప్పారు. బియ్యం వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. ధరల స్థిరీకరణ కోసం 2014 నుంచి ప్రత్యేక మంత్రుల బృందం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని వివరించారు. సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించడంద్వారా ధరల పెరుగుదలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు రైతులకు కనీసమద్దతు ధర (ఎంఎస్‌పి) లభించేలా అవసరాన్నిబట్టి ఎగుమతులపై ఆంక్షలు విధిస్తు న్నామని పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లలో ఒడిదుడుకులు, భౌగోళిక రాజకీయ సంఘర్ష ణలు, ముడి చమురు ధరల పెరుగుదల వంటి అంతర్జాతీయ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని మంత్రి తెలిపారు. ఇలాంటి బాహ్య సవాళ్లను ఎదుర్కొంటూనే ప్రజలపై అధిక భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# ఐపిఒకు సిద్ధమైన ఆంత్రోపిక్

### నాస్‌డాక్‌లో ఎఎన్‌టి టికర్‌తో లిస్టింగ్‌కు దరఖాస్తు




**న్యూయార్క్, అక్టోబరు 26:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్న నేప థ్యంలో, ప్రముఖ ఎఐ సంస్థ ఆంత్రోపిక్ పిబిసి అమెరికాలో తన తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ) కోసం బహిరంగంగా దరఖాస్తు చేసింది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ దిశగా ఇది కీలక ముందడుగుగా నిలిచింది. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్‌కు సమర్పించిన పత్రాల ప్రకారం, ఆంత్రోపిక్ తన క్లాస్ఏ కామన్ స్టాక్‌ను నాస్‌డాక్ గ్లోబల్ సెలెక్ట్ మార్కెట్‌లో ఎఎన్‌టి టికర్ సింబల్‌తో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఈ ఐపిఒకు గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ తదితర సంస్థలు ప్రధాన బుక్‌రన్నర్లుగా వ్యవహరించను న్నాయి. ఐపిఒ వివరాలు ఇంకా వెల్లడి కాలేదు ఈ ఐపిఒలో ఎన్ని షేర్లను విక్రయించనున్నది, ఒక్కో షేరు ధర ఎంత ఉండనుంది అనే వివరాలను ఆంత్రోపిక్ ఇంకా వెల్లడించలేదు. ఈ ఆఫరింగ్‌లో కంపెనీ విక్రయించే షేర్లతో పాటు, ఇప్పటికే వాటాలను కలిగి ఉన్న కొంతమంది పెట్టుబడిదారులు విక్రయించే షేర్లు కూడా ఉండనున్నాయి. అయితే, ప్రస్తుత వాటాదారులు విక్రయించే షేర్ల ద్వారా వచ్చే ఆదాయం కంపెనీకి అందదు. ఈ ఆఫరింగ్‌కు ముందు తమ క్లాస్ఏ కామన్ స్టాక్‌కు ఎలాంటి పబ్లిక్ మార్కెట్ లేదని కంపెనీ స్పష్టం చేసింది. ఆంత్రోపిక్ ఐపిఒ ద్వారా కంపెనీ విలువ 2 ట్రిలియన్ డాలర్ల వరకు చేరవచ్చని అంచనాలు ఉన్నాయి. కంపెనీ తన వాల్యుయేషన్‌ను అధికారికంగా ధ్రువీకరించ లేదు. ఎస్ఇసికి సమర్పించిన పత్రాల్లో వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఈయేడాది తొలి ఆరు నెలల్లో ఆంత్రోపిక్ 16.3 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇదే సమ యంలో కంపెనీ 80.7 బిలియన్ డాలర్ల నికర నష్టాన్ని కూడా ప్రకటించింది.

భవిష్యత్తులో లాభదాయకతను సాధించడం లేదా కొనసా గించడం సాధ్యం కాకపోవచ్చని కంపెనీ తన ఫైలింగ్‌లో హెచ్చరించింది. ఎఐ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణ కోసం భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావడం కంపెనీ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఈ వివరాలు సూచిస్తున్నాయి. ఎఐ మౌలిక సదుపాయాల కోసం ఆంత్రోపిక్ భారీగా ఖర్చుచేయనుంది. మరోవైపు, గత 12 నెలల ఆదాయ గణాంకాల ఆధారంగా ఒక్కో సంస్థ నుంచి 1 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం అందిస్తున్న 1,900 మందికి పైగా కస్టమర్లు తమకు ఉన్నారని ఆంత్రోపిక్ తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.